



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]
అమ్మబడును




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 205 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 17 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయాలి

### రష్యాతో జిన్‌పింగ్

బీజింగ్, విశ్వం వాయిస్ న్యూస్ : ఐక్యరాజ్యసమితి ఆధిపత్య పునరుద్ధరణలో, మరింత సముచితంగా.. సహేతుకంగా అంతర్జాతీయ మిగతా .. 2లో..



## సౌదీ ఇచ్చింది.. యూపీఏ చెల్లించమంటోంది

### పాక్ పరిస్థితి

విశ్వం వాయిస్ న్యూస్ : పాకిస్థాన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సౌదీ అరేబియా నుంచి 2 బిలియన్ మిగతా .. 2లో..



## సంక్షోభం కొనసాగితే విమానాలు రద్దే...

### ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ

విశ్వం వాయిస్ న్యూస్ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న యుద్ధం కారణంగా అనేక దేశాలు ఇంధన కొరత మిగతా .. 2లో..




## అమెరికాలో మాస్టర్స్‌కే హెచ్-1బీలో పెద్దపీట?

వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికాలో విదేశీ ఉద్యోగుల నియామక ప్రక్రియను కఠినతరం చేయాలని ప్రతిపాదించిన ట్రంప్ సర్కారు దానిపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటోంది. హెచ్-1బీ వీసాల మిగతా .. 2లో..

# ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం



- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి
- మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్ ప్రక్రియలో భాగంగా, తొలి వ్యక్తిగా తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిలోని తన నివాసంలో se.census.gov.in వెబ్ సైట్ ద్వారా చంద్రబాబు వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్ల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి భౌతికంగా వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పౌరులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు మిగతా .. 2లో..

### ఏపీలో పలువురు

## మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విజయవాడ మున్సిపల్ కమిషనరేట్‌లో జోనల్ కమిషనర్‌గా ఉన్న రమ్య కీర్తనను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. దర్శి మున్సిపల్ కమిషనర్‌గా అర్జునరావు, పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా మునికుమార్, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్, తెనాలి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా రామారావు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సౌత్ జోనల్ కమిషనర్‌గా ప్రసాదరావు, మిగతా .. 2లో..

### మహిళా రిజర్వేషన్లకు

## జనసేన కట్టుబడి ఉంది

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టసవరణ బిల్లులు పార్లమెంట్ ముందుకు రావడాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతించారు. మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉందన్నారు. 2019 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఈ సవరణతో చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. సమర్థులైన మహిళలు దృఢమైన కుటుంబాలను తయారు చేస్తారని, దృఢమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయని పవన్ వ్యాఖ్యానించారు. మహిళల భాగస్వామ్యంతోనే దేశం సాధికారతవైపు పయనిస్తుందన్నారు. ఇలాంటి శుభ సందర్భంలో మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన తొలి భారతీయురాలిగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించారని పవన్ అన్నారు. ఫిడే మహిళల టోర్నమెంట్‌లో విజేతగా నిలవడంపై అభినందనలు తెలిపారు.

### కందుకూరి వీరేశలింగం పంతులుకు


## వైఎస్ జగన్ నివాళి



తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : కందుకూరి వీరేశలింగం పంతులుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. "సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని సమాజాన్ని మార్చిన మహోన్నతుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. సామాజిక అసమానతలపై నిర్భయంగా పోరాడుతూ, స్త్రీ విద్యకు నాంది పలికిన మహోన్నతుడు మిగతా .. 2లో..

### ఈ నెల 25 నుంచి 27 వరకు

## తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు




తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ : శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఏప్రిల్ 25 నుంచి 27 తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో తొలిరోజు శ్రీమలయప్పస్వామివారు గజవాహనం, రెండోరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడ వాహనంపై మిగతా .. 2లో..

### జగన్ మోహన్‌రెడ్డి సర్..

## ఇవేం రాక్షస చేష్టలు?

### మంత్రి నారా లోకేష్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం మిగతా .. 2లో..

### మహిళా రిజర్వేషన్ బిల్లు

## దశాబ్దాల కల

### లోక్‌సభఎంపీ పురందేశ్వరి



ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : మహిళా రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని రాజమండ్రి లోక్‌సభ ఎంపీ పురందేశ్వరి అన్నారు. గతంలో చాలాసార్లు బిల్లు పెట్టినా సాకారం కాలేదని, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతివ్వలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగిందని గ్రహించాలన్నారు. "ఈ బిల్లు పాస్ కావడం మహిళల మిగతా .. 2లో..

### పెళ్లికి సవర బంగారం,

## రైతులకు రుణ మాఫీ..

### టీవీకే అధినేత, నటుడు విజయ్ మ్యానిఫెస్టో



విశ్వం వాయిస్ న్యూస్ : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత, నటుడు విజయ్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే.. 60ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం, పేద అమ్మాయిల వివాహాలకు సవర (ఎనిమిది గ్రాముల బంగారం), నాణ్యమైన పట్టు చీర కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక బృందాలకు రూ.5లక్షల వరకు వడ్డీలేని మిగతా .. 2లో..

### మహిళా రిజర్వేషన్లను

## వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు

### లోక్‌సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



విశ్వం వాయిస్ న్యూస్ : మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

#### గిఫ్ట్ కాదు.. ఇది హక్కు

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో మిగతా .. 2లో..

## ఏపీలో 38, తెలంగాణలో 26 స్థానాలు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



విశ్వం వాయిస్ న్యూస్ : డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం మిగతా .. 2లో..

## అంత భావోద్వేగం వద్దు

### 'అశోకచక్రం'పై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం



విశ్వం వాయిస్ న్యూస్ : జాతీయ పతాకంపై అశోక చక్రం ఎలా చూపాలన్న దానిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ అంశంపై విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. 'సమాజానికి ఉపయోగపడే అంశాలను ధర్మాసనం ముందుకు తీసుకురావచ్చు కదా' అని పిటిషనర్‌పై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసిలో ఓ కూడలిలో ఉంచిన అశోక చక్రాన్ని ఉదహరిస్తూ పిటిషనర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా .. 2లో..

### హైదరాబాద్ రావాల్సిన ఆకాశ విమానాన్ని

## ఢీకొన్న స్పైస్‌జెట్




విశ్వం వాయిస్ న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం మిగతా .. 2లో..

## యుద్ధానికి త్వరలో ముగింపు

**అందుకు చేరువగా ఉన్నాం - అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

**రెండో విడత చర్చలకు మధ్యవర్తుల ప్రయత్నాలు - టెహ్రాన్‌లో మునీర్ బృందం**



కైరో, వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని.. అందుకు అత్యంత చేరువగా ఉన్నామని పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందనీ చెప్పారు. ఇక అమెరికా-ఇరాన్ మధ్య రెండో విడత చర్చల ఏర్పాటుకు మధ్యవర్తుల ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా తమ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ నేతృత్వంలో ఓ బృందాన్ని టెహ్రాన్‌కు పాకిస్థాన్ బుధవారం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయాలి

నియమ నిబంధనలు అమలు జరిగేలా చూడటంలో చైనా-రష్యా కలిసి పనిచేయాలని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) వంటివాటిలో పరస్పరం సహకరించుకోవాలని అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, దానికి వ్యతిరేకంగా తమ దేశాలు రెండూ ప్రయత్నాలు ముమ్మరం చేయాలని చెప్పారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గే లవ్రోవ్ బుధవారం బీజింగ్‌లో తనతో భేటీ అయిన సందర్భంగా జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం నేపథ్యంలో గత కొద్దిరోజులుగా ట్రంప్ తీరును విమర్శిస్తున్న చైనా అధ్యక్షుడు మరోసారి వాటి తీవ్రతను పెంచారు."ప్రపంచం మళ్లీ ఆటవిక రాజ్యంవైపు వెళ్లిపోకుండా నిలువరించాలి. బహుళపాక్షిక వాదాన్ని.. అంతర్జాతీయ చట్టబద్ధపాలనను పునరుద్ధరించాలి.దీనికి మనం బలంగా అండదండలివ్వాలి. మన రెండు దేశాలు వ్యూహాత్మక కట్టుబాటుతో, పరస్పర విశ్వాసంతో ఒకదానికొకటి మద్దతు ఇచ్చుకోవాలి" అని లవ్రోవ్‌తో జిన్‌పింగ్ చెప్పారు.

## సౌదీ ఇచ్చింది.. యూఏఈ చెల్లించమంటోంది

డాలర్లు వచ్చాయన్న ఆనందం కన్నా.. యూఏఈకి ఈ నెలలో అప్పు తిరిగి తీర్చాలన్న ఆలోచన దానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పాక్ ప్రస్తుతం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దాని విదేశీ మారక నిల్వలు కూడా క్షీణిస్తున్నాయి. ఈ క్రమంలో పాక్‌కు 3 బిలియన్ డాలర్లు ఆర్థికసాయం చేసేందుకు సౌదీ ముందుకొచ్చింది. అందులోభాగంగా సౌదీ ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఆ దేశానికి తాజాగా 2 బిలియన్ డాలర్లు అందాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ తాజాగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. మరోవైపు.. పశ్చిమాసియా సంక్షోభంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న పాక్‌కు యూఏఈ షాకిచ్చింది. గతంలో ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32 వేల కోట్లు) రుణాన్ని తిరిగి చెల్లించాలని కోరింది. ఇప్పటివరకు యూఏఈ వద్ద తాము అప్పుగా తీసుకొన్న డబ్బు తిరిగి చెల్లిస్తామని పాక్ వెల్లడించింది. మార్చి 27 నాటికి పాక్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. తాజాగా సౌదీ నుంచి వచ్చిన ఆర్థిక సాయంతో.. ఈ నెలాఖరులోగా యూఏఈకి చెల్లించాల్సిన మొత్తాన్ని దాయాది దేశం తిరిగి చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. బుధవారం క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌ను కలిసి.. పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

## సంక్షోభం కొనసాగితే విమానాలు రద్దే...

ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ కీలక వ్యాఖ్యలు చేసింది. ఐరోపా వద్ద జెట్ ఫ్యుయల్ మరో ఆరు వారాలకు సరిపడా మాత్రమే ఉందని తెలిపింది. చమురు సంక్షోభం ఇలాగే కొనసాగితే.. విమాన సర్వీసులు రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి మార్గంలో ఇంధనం, గ్యాస్‌తోపాటు కీలక సరఫరా వ్యవస్థలకు ఆటంకం ఏర్పడటం వల్ల ఎన్నడూ చూడని ఇంధన సంక్షోభం ఏర్పడిందని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. దీని ప్రభావం వల్ల పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతాయన్నారు.

### అమెరికాలో మాస్టర్స్‌కే హెచ్-1బీలో పెద్దపీట?

దుర్వినియోగాన్ని అరికట్టడానికి, తమ కార్మికుల వేతనాలను కాపాడటానికి 'అమెరికా కార్మిక శాఖ (డీఓఎల్)' మార్చి 27న సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జూన్ 30లోపు దాఖలయ్యే పిటిషన్లపై దీని ప్రభావం పడదని భావిస్తున్నారు. వీటిపై ప్రజాభిప్రాయాన్ని తెలిపేందుకు 60 రోజుల గడువునిచ్చింది. మార్పులు ప్రధానంగా వేతనాలు, అర్హతలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం హెచ్-1బీ వీసాపై ఉన్నవారు గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి చట్టబద్ధంగా అనుమతి ఉంది. ట్రంప్ ప్రభుత్వం దీనిని మార్చాలని భావిస్తోంది. హెచ్-1బీ అనేది కేవలం తాత్కాలిక అవసరాల కోసం ఇచ్చే వీసా అని, దీనిని శాశ్వత నివాసం పొందేందుకు వాడకూడదని ఈ ప్రతిపాదన స్పష్టం చేస్తోంది. అమెరికాలోని యూనివర్సిటీల్లో మాస్టర్స్ లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్న విద్యార్థులకు వీసా కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులను నియమించుకునే ముందు, ఆ ఉద్యోగానికి తగిన అమెరికా అభ్యర్థి దొరకలేదని కంపెనీలు నిరూపించుకోవాలి. కంపెనీలు తక్కువ జీతానికి విదేశీయులను తీసుకోకుండా ఉండేందుకు, కనీస వేతనాన్ని 30% మేర పెంచాలని ప్రతిపాదించింది.

ఏపీలో పలువురు

## మున్సిపల్ కమిషనర్ల బదిలీ

గుంటూరు మున్సిపాలిటీ అడిషనల్ కమిషనర్‌గా మల్లయ్య నాయుడు నియమితులయ్యారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఏప్రీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అంత భావోద్వేగం వద్దు

ధర్మాసనం స్పందిస్తూ.. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగానికి గురవ్వాల్సిన అవసరం లేదు. మీ ఆలోచన మంచిదే.. కానీ సంబంధిత అధికారులతో ఈ విషయాన్ని చర్చించండి. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడండి. సమాజానికి ఉపయోగపడేవి, నిర్మాణాత్మకమైన పనులను చేయండి" అని పిటిషనర్‌కు సూచించింది.

### ఆ న్యాయవాది మరోసారి..

గతంలో న్యాయవాది సచిన్ గుప్తా దాఖలు చేసిన 25 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు విచారణ నేపథ్యంలో ఆ పిల్స్ ఆధారరహితంగా, అస్పష్టంగా ఉన్నాయి, వాటిని విత్‌డ్రా చేసుకోమని ధర్మాసనం సలహా ఇచ్చిన సంగతి తెలిసిందే. గతంలో ఆ పిల్స్‌ను గుప్తా ఉపసంహరించుకోగా.. తాజాగా ఆయన దాఖలు చేసిన మరో 47 పిల్స్ నుంచి ఉపయోగపడని కొన్నింటిని విత్‌డ్రా చేసుకోమని ధర్మాసనం సూచించింది. "కోర్టు అనుమతితో ఈ పిల్స్‌ని ఉపసంహరించుకుంటా" అని సచిన్ ధర్మాసనానికి తెలిపారు.

కందుకూరి వీరేశలింగం పంతులుకు

## వైఎస్ జగన్ నివాళి

ఆయన. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళు లర్పిస్తున్నాను" అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని సమాజాన్ని మార్చిన మహోన్నతుడు కందుకూరి వీరేశ లింగం పంతులుగారు. సామాజిక అసమానతలపై నిర్భయంగా పోరాడుతూ, స్త్రీ విద్యకు నాంది పలికిన మహోన్నతుడు ఆయన. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళు లర్పిస్తున్నాను.

ఈ నెల 25 నుంచి 27 వరకు

## తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు

విహరించనున్నారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. శ్రీ పద్మావతి పరిణయోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 25 నుంచి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.

## మహిళా రిజర్వేషన్ బిల్లు దశాబ్దాల కల

దశాబ్దాల కల. 2023లో మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతోంది. జనగణన పేరుతో అభ్యంతరాలు చెబుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మొట్టమొదట 1996లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ మాత్రం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది" అని అన్నారు.

జగన్ మోహన్‌రెడ్డి సర్..

## ఇవేం రాక్షస చేష్టలు?

అంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు?" అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెళ్లికి సవర బంగారం,

## రైతులకు రుణ మాఫీ..

రుణాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో డ్రాప్‌ఔట్‌లను నిర్మూలించేందుకు విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15000 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రైతులపైనా విజయ్ వరాల హామీలు కురిపించారు. ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల వ్యవసాయ రుణాల మాఫీ, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నవారికి 50శాతం మాఫీ, కనీస మద్దతు ధర వరికి క్వింటాలుకు రూ.3500, చెరకుకు రూ.4500, కుటుంబానికి ఏడాదికి ఆరు ఉచితంగా సిలిండర్లు, ఏఐ మంత్రిత్వశాఖ, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ ఏర్పాటు, పట్టభద్రులైన నిరుద్యోగులకు నెలకు రూ.4వేల ఆర్థిక సాయం, కొత్తగా ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, వృద్ధులు, దివ్యాంగులకు రూ.3వేల పింఛను, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా వంటి తదితర హామీలను ప్రకటించారు.

మహిళా రిజర్వేషన్లను

## వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు

సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు" అని మోదీ వ్యాఖ్యానించారు.

### ఆ పార్టీలకే మనుగడ..

"మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది" అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

### దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..

"ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం" అని మోదీ స్పష్టం చేశారు.

### నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి

"ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం" అని మోదీ విపక్షాలను కోరారు.

హైదరాబాద్ రావాల్సిన ఆకాశ విమానాన్ని

## ఢీకొన్న స్పైస్‌జెట్

ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. "ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

## ఏపీలో 38, తెలంగాణలో 26 స్థానాలు

కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. " తెలంగాణలో ప్రస్తుత లోక్‌సభ సీట్లు 3.13శాతంగా ఉన్నాయి. 26కు పెంచాక మొత్తం సీట్లలో తెలంగాణ శాతం 3.18కు పెరుగుతుంది. దక్షిణాదిలో మొత్తం ఎంపీ స్థానాలు 129 (23.76శాతం) నుంచి 195 (23.97శాతం)కు పెరుగుతాయి. దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుందో సభ్యులు చెప్పాలి. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. మొత్తం సీట్లలో 33శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. జనరల్ స్థానాల్లోనూ మహిళలకు అవకాశమిస్తే వారి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

### సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం - డీఎంకే

ఒకవేళ డీలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే.. సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని డీఎంకే పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల కోసం న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ న్యాయ వ్యవహారాల కార్యదర్శి ఎన్.ఆర్. ఎలాంగో పేర్కొన్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి పార్లమెంటులో మౌఖికంగా మాత్రమే హామీ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను బిల్లులో స్పష్టంగా పేర్కొనాల్సి ఉన్నప్పటికీ అలా జరగలేదని, కోర్టును ఆశ్రయించడానికి సరైన కారణాలు ఉన్నాయన్నారు.

### మహిళా కోటా అమలు చేయండి - ఠాక్రే

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని శివసేన (యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. అయితే, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రం తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇది ఏ ఒక్క పార్టీ భవిష్యత్తుకు సంబంధించినది కాదని, దేశ భవిష్యత్తుకు చెందినదన్నారు. దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఠాక్రే స్పష్టం చేశారు.

## యుద్ధానికి త్వరలో ముగింపు

పంపించింది. మరోవైపు- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తోంది. దీంతో ఆగ్రహించిన టెహ్రాన్.. దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రాంతీయంగా వాణిజ్య కార్యకలాపాలను అడ్డుకుంటామని తాజాగా హెచ్చరించింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రం, ఎర్రసముద్రం వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు సాగనివ్వబోమని పేర్కొంది.

### ఇరాన్ అణ్వస్త్రాలను తయారుచేసుకునేది : ట్రంప్

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే.. ఇరాన్‌తో యుద్ధం దాదాపు ముగిసినట్లే కనిపిస్తోందని ట్రంప్ బుధవారం ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో వ్యాఖ్యానించారు. అయితే పూర్తిస్థాయి పరిష్కార మార్గం కోసం చర్చలు ఇంకా జరగాలన్నారు. తాము ఇప్పుడు నిలువరించి ఉండకపోతే.. ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేసుకొని ఉండేదని ఆయన పేర్కొన్నారు. ఆ దేశంపై సైనిక చర్యను ఇంకా పూర్తిగా ఆపేయలేదని, పరిస్థితిని బట్టి ఆ విషయంలో ముందడుగు వేస్తామని చెప్పారు. కాల్పుల విరమణ గడువు పొడిగింపునకు కాకుండా, శాశ్వత శాంతి ఒప్పందంవైపే తాము మొగ్గుచూపుతున్నామని అన్నారు. యుద్ధం ముగిశాక చమురు ధరలు భారీగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వకుండా ఉండేందుకు చైనా అంగీకరించిందని ట్రంప్ తెలిపారు.

### మరో రెండు వారాలపాటు కాల్పుల విరమణ?

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ఈ నెల 22తో ముగియనుంది. దాన్ని కనీసం మరో రెండు వారాలపాటు పొడిగించాలని, తద్వారా శాశ్వత ఒప్పందం కుదిరే దిశగా దౌత్య ప్రయత్నాలు కొనసాగేలా చూడాలని మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఇరాన్ అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి, యుద్ధం కారణంగా కలిగిన నష్టానికి పరిహారం చెల్లింపు అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్లే వాషింగ్టన్-టెహ్రాన్ తొలి దఫా చర్చలు విఫలమయ్యాయి. వీటిపై ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చేందుకు మధ్యవర్తులు కృషిచేస్తున్నట్లు తెలుస్తోంది. తమ యురేనియం శుద్ధి ప్రణాళికలపై చర్చించేందుకు సిద్ధమేనని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తాజాగా తెలిపారు. అయితే అవసరాలకు అనుగుణంగా యురేనియం శుద్ధిని కొనసాగించేందుకు తమను అనుమతించాలని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా బెడదను తొలగించుకోవాలని లెబనాన్ ప్రభుత్వం భావిస్తోందని అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి యెకీల్ లెయిటర్ పేర్కొన్నారు. వాషింగ్టన్ వేదికగా మంగళవారం తమ మధ్య రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో లెబనాన్ రాయబారి నడా హమదే మోవాద్ ఈ విషయాన్ని స్పష్టం చేశారని చెప్పారు. ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య ఘర్షణకు సత్వరం తెరపడాల్సిన ఆవశ్యకతను మోవాద్ నొక్కిచెప్పారు. ఇరుపక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాలని విన్నవించారు.

### యుద్ధ ప్రభావం నా పర్యటనపై ఉండదు

వచ్చేనెలలో ట్రంప్ చైనా పర్యటనకు రానున్నారు. ఇరాన్ యుద్ధ ప్రభావం దీనిపై పడుతుందన్న అభిప్రాయాన్ని ఆయన తోసిపుచ్చారు. చైనాకు చమురు కావాలని, తమకు కాదని బుధవారం 'ఫాక్స్ బిజినెస్' ప్రసారం చేసిన ముఖాముఖిలో పేర్కొన్నారు. ఇరాన్‌కు ఆయుధ ఎగుమతులు చేయవద్దని తాను జిన్‌పింగ్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. అలాంటిదేమీ ఉండదని ఆయన ప్రత్యుత్తరం ఇచ్చారని తెలిపారు.

### ఆ విషయం పోప్‌నకు ఎవరైనా చెప్పండి

వాషింగ్టన్: పోప్ లియో-14పై ట్రంప్ మరోసారి విమర్శలు చేశారు. ఇరాన్ తమ దేశంలో గత రెండు నెలల్లో 42 వేల మంది నిరాయుధులైన నిరసనకారులను చంపింది. ఆ విషయాన్ని దయచేసి ఎవరైనా పోప్‌నకు చెప్పండి అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచానికి శాంతి, సామరస్యం అత్యవసరమని పోప్ అన్నారు. ఆఫ్రికా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం తన విమానంలో విలేకర్లతో మాట్లాడారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న అల్జీరియాలోని ఓ ప్రఖ్యాత చర్చి, మసీదులను తన పర్యటనలో సందర్శించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. "ముస్లింలు, క్రైస్తవుల విశ్వాసాలు, ప్రార్థనా విధానాలు, జీవన విధానాలు భిన్నంగా ఉన్నా, శాంతి, సామరస్యాలతో కలసి మెలిసి జీవిస్తున్నారు. ప్రపంచానికి ఈ సందేశం ఇప్పుడు అత్యవసరం" అని పోప్ వ్యాఖ్యానించారు.

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం

సమానంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసం కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జనగణన జరగడం ఇదే తొలిసారి అని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల గణన ప్రారంభమైందని, వచ్చే ఏడాది రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతారని సీఎం వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సరైన వివరాలు నమోదు చేసి ఈ బృహత్కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## డీల్‌కు ఇరాన్ నో అంటే దాడులకు మేం రెడీ : హెగ్సెత్

**పెంటగాన్, విశ్వం వాయిస్ న్యూస్ :** శాంతి ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ దాడులు మొదలుపెడతామని అమెరికా హెచ్చరించింది. తమ మిలిటరీ బలగాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది. గతం కంటే మరింత బలీయంగా పోరుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు. ఈ మేరకు పెంటగాన్‌లో ఇరాన్ అంశంపై మీడియాతో మాట్లాడారు. అవసరమైతే ఇరాన్ పోర్టుల నుంచి నౌకల రాకపోకలు దీర్ఘకాలం అడ్డుకునేందుకు సిద్ధమన్నారు. "ఒక సుసంపన్నమైన భవిష్యత్ కోసం, తమ దేశ పౌరుల కోసం ఇరాన్ ఒక మంచి నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నా. అలా కాకుండా అవివేకంగా వ్యవహరిస్తే మాత్రం నౌకల రాకపోకలు స్తంభింపజేస్తాం. ఇంధన మౌలిక సదుపాయాలపై, విద్యుత్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపిస్తాం" అని హెచ్చరించారు. ఈ విరామ సమయంలో అమెరికా సంయుక్త దళాలు తమ పోరాటాన్ని తిరిగి కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని.. అందుకు అత్యంత చేరువగా ఉన్నామని ట్రంప్ బుధవారం పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. కాల్పుల విరమణ గడువు పొడిగింపునకు కాకుండా, శాశ్వత శాంతి ఒప్పందంవైపే తాము మొగ్గుచూపుతున్నామని అన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ఈ నెల 22తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకునేలా ఆ దేశంపై అమెరికా ఒత్తిడి పెంచుతున్నట్లు కనిపిస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## ఐ లవ్ లోకేష్..
## రఘురామ ఆసక్తికర వ్యాఖ్యలు

తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కు మధ్య గ్యాప్ ఉందనేది కేవలం తప్పుడు ప్రచారమేనని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు స్పష్టం చేశారు. తనకు మంత్రి లోకేశ్ అంటే చాలా ప్రేమ అని, ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే ఎంతో గౌరవమని రఘురామ వెల్లడించారు. మేము మేము కొట్లాడుకోవాలని కొందరు కలలు కంటున్నారని, అలాంటి ఆశావాదులకు నిరాశే మిగులుతుందని రఘురామ వ్యాఖ్యానించారు. ఓ వెబ్ చానల్ కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రఘురామరాజు ఆసక్తికర సమాధానాలిచ్చారు.

**క్లారిటీ ఇచ్చినట్లేనా..!**

పొలిటికల్ ఫైర్ బ్రాండ్, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారాన్ని కొట్టిపడేశారు. తమ మధ్య బేధాభిప్రాయాలు వచ్చే అవకాశమే లేదని తేల్చిచెప్పారు. 'లోకేశ్‌ను నేను చాలా ఇష్టపడుతా.. లోకేశ్‌తో నేను చాలా క్లోజ్.. చంద్రబాబు 100 శాతం నన్ను ప్రేమిస్తున్నారు.' అంటూ రఘురామరాజు చెప్పారు. మంత్రి పదవి ఇవ్వలేదని రఘురామ అసంతృప్తిగా ఉన్నారని, అదే సమయంలో రఘురామ వివాదాస్పద వ్యవహారశైలితో సామాజికవర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయని సీఎం అసహనం వ్యక్తం చేస్తున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై తొలిసారిగా స్పందించిన తాను కూటమిలో సంతృప్తికరంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

**అమరావతి కోర్ కేపిటల్**

ఇక గురువారం మీడియాతో మాట్లాడిన రఘురామరాజు రాజధాని అమరావతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చెబుతున్న మావిగన్ 'సీఆర్డీఏ' పరిధిలో ఉందని స్పష్టం చేశారు. అమరావతి అనేది కేవలం కోర్ కేపిటల్ మాత్రమేనని చెప్పారు. కోర్ కేపిటల్ లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉంటాయని చెప్పారు. రాజధాని కోసం తీసుకున్న భూములతో సీఎం ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేశారని, భవిష్యత్తు అవసరాల కోసం ఆ భూమి ఎంతో ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు.

**ఇరిటేషన్ తోనే కొత్త పేర్లు**

అమరావతి ఒక సెల్ఫ్ ఫైనాన్స్ నగరమని, రాజధాని కోసం చేసిన అప్పులను ఆ నగరం ద్వారా వచ్చే ఆదాయంతోనే తీర్చుతామని వెల్లడించారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారని, అది నచ్చని వారే మావిగన్ అంటూ పిచ్చి పిచ్చి పేర్లు పెడుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామ విమర్శించారు. దేవతలను ఇష్టపడని దానవులు ఇరిటేషన్ తెచ్చుకుంటున్నారని రఘురామ దెప్పిపొడిచారు. అమరావతిని దేవతల రాజధానిగా అనడం మానేస్తే దానవులు కొత్త పేర్లు పెట్టడం మానేస్తారని రఘురామ వ్యాఖ్యానించారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..



### 8 మంది మృతి, 13 మందికి గాయాలు

**ఎమ్మిగనూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకల డోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతులకు ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ సంతాపం**

రోడ్డు ప్రమాదంపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ స్పందించారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

## భార్యాభర్తల గొడవ.. మధ్యవర్తిపై గొడ్డలితో దాడి

### నిందితుడిని గొలుసుతో బంధించిన పోలీసులు – గోపాల్ దుస్థితి ఇలా..



**జుక్కల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ మధ్య గొడవ జరిగిన ప్రతిసారీ మధ్య వర్తిత్వానికి వస్తున్నాడనే కోపంతో గొడ్డలితో దాడి చేశాడో వ్యక్తి. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడి కాలికి గొలుసు కట్టి తాళం వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. జుక్కల్‌కు చెందిన కరంజీ గోపాల్ తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా ఘర్షణ పడి గొడ్డలితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. భయపడిన భార్య, పిల్లలు ఇంటి నుంచి పారిపోయారు. గొడవ జరిగినప్పుడల్లా ఎదురింటి దత్తు మధ్యవర్తిత్వానికి వస్తున్నాడని, వారిని ఎక్కడికో పంపించాడన్న ఆగ్రహంతో గోపాల్.. ఆరుబయట నిద్రిస్తున్న దత్తు మెడపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన ఆయనను బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు గోపాల్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి వైద్యపరీక్షల కోసం జుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో మంచానికి గొలుసు కట్టి నిందితుడి కాలికి తాళం వేశారు. దీనిపై జుక్కల్ ఎస్సై మురళిని వివరణ కోరగా.. నిందితుడు మళ్లీ దాడి చేస్తాడేమోనన్న జాగ్రత్త, వైద్య సిబ్బంది భయపడుతున్నారన్న ఉద్దేశంతో కాలికి తాళం వేశామని చెప్పారు.

## కాకినాడ పోర్టు వద్ద పేదల బియ్యం పట్టివేత

### రూ.2.54 కోట్ల సరకు స్వాధీనం

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున పేదల బియ్యాన్ని పట్టుకున్నారు. తొలుత వారు పోర్టు వద్ద ఉన్న బార్జీలు, రైల్వే వ్యాగన్లలో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేశారు. ఇక్కడున్న చెక్ పోస్టుల్లో నమోదైన వివరాలను పరిశీలించారు. అనంతరం పోర్టుకు సమీపంలో ఉన్న పలు గోదాముల్లో ఉప్పుడు బియ్యాన్ని తనిఖీ చేశారు. ఆన్‌లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న పది లారీలను పరిశీలించగా వాటిలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను ప్రాథమికంగా గుర్తించి చౌకబియ్యంగా నిర్ధారించారు. పది లారీల్లో ఉన్న 260 టన్నుల బియ్యం, గోదాముల్లో ఉన్న 650 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.54 కోట్లుగా అంచనా వేశారు. పది లారీలను సీజ్ చేసి, వీటి విలువ రూ.కోటిగా గుర్తించారు. మొత్తం రూ.3.54 కోట్లు సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు తెలిపారు.

## వడదెబ్బతో ఇద్దరి మృతి

**డోర్నకల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వడదెబ్బతో బుధవారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చోట్ల మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని యాదవనగర్‌కు చెందిన పశువులకాపరి సకినాల వెంకటనారాయణ (55) ఉదయం గేదెలను మేతకు తీసుకెళ్లి అక్కడే అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళుతుండగా.. మృతి చెందారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో వడదెబ్బతో రైతు అంతటి స్వామిగౌడ్(59) మృతి చెందారు.

బోడుప్పల్‌లో అమానుషం..

## చిన్నారికి యాసిడ్ తాగించిన పిన్ని

**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తన కొడుకును ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే కారణంతో తోడికోడలి కుమారుడిపై దారుణానికి ఒడిగట్టింది ఓ మహిళ. నాలుగేళ్ల చిన్నారికి ఆమె యాసిడ్ తాగించింది. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ శ్రీనివాస కాలనీలో ఉండే పర్వతం సతీష్ కుమార్, అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు నాగరాజు, జగదీష్ ఉన్నారు. వారిద్దరికి వివాహాలు అయ్యి, పిల్లలు ఉన్నారు. అంతా ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కుమారుడి కొడుకు (4)పై తాత ఎక్కువ ప్రేమ చూపిస్తున్నాడని, తన బిడ్డను పట్టించుకోవడం లేదని చిన్న కోడలు మంజుల కక్ష పెంచుకుంది. ఇటీవల తాత తన చేతిపై పెద్ద కుమారుడి కొడుకు పేరు పచ్చబొట్టు వేయించుకున్నారు. దీంతో ఆమె ఆ పిల్లాడిని అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చింది. ఇటీవల ఇంట్లో చిన్నారి నోరు, ముక్కు మూసి చేతులు పట్టుకుంది. బాలుడి తల్లి గమనించి, ప్రశ్నించడంతో ఆడుకుంటున్నామని చెప్పి తప్పించుకుంది. మరోసారి ఆ బాలుడిని ఇంటిపై అంతస్తుకు తీసుకెళ్లి రెయిలింగ్‌పై కూర్చోబెట్టింది. ఇది గమనించిన తాత ఆమెను మందలించాడు. ఈ నెల 9న మంజుల అతడిని కిచెన్‌లోకి తీసుకెళ్లి జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని చెప్పి.. యాసిడ్ తాగించింది. బాలుడి పరిస్థితి గమనించిన తల్లిదండ్రులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బుధవారం రాత్రి చిన్నారి తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాయం చేద్దామని వెళ్తే.. ప్రాణాలు పోయాయి

### మంటలార్పేందుకు వెళ్లిన ఇరుగూ పొరుగు
### ఇంట్లో ఒక్కసారిగా పేలుడు.. నలుగురి దుర్మరణం – 25 మందికి గాయాలు



**కదిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** పక్కింట్లోంచి భారీగా పొగ వస్తుండటం.. ఇంటిల్లిపాది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటికి రావడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యారు. అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని భావించి ఆర్పేందుకు బకెట్లు, బిందెలతో నీళ్లు తీసుకొని ఇంట్లోకి వెళ్లారు. అంతే.. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఇల్లు నేలమట్టమైంది. సాయానికి వెళ్లిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ హృదయవిదారక ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన వెంకన్న కుటుంబం పదేళ్ల కిందట కుమ్మరవాండ్లపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటోంది. వీరు బ్లాస్టింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు వీరి ఇంటి నుంచి దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే వెంకన్న, కుటుంబ సభ్యులంతా భయంతో కేకలు వేస్తూ బయటకు వెళ్లిపోయారు. అరుపులు విని, పొగ చూసిన ఇరుగుపొరుగు వారు ఇంట్లో నిప్పంటుకుందని భావించి ఆర్పేందుకు బకెట్లతో నీళ్లు తీసుకొని లోనికి వెళ్లారు. అదే సమయంలో ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. ఈ ప్రమాదంలో విశ్వనాథ్‌రెడ్డి (52), మాబున్నీసా (52), మధుసూదన్ (40), అస్లాం (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి మరో రెండిళ్లు పూర్తిగా, 4 పాక్షింగా దెబ్బతిన్నాయి. ఆ శకలాలు ఎగిరిపడి కాలనీలోని 25 మందికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితివిషమంగా ఉంది. గాయపడ్డవారిని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం తర్వాత వెంకన్న కుటుంబం పరారైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద స్థలిని డీఐజీ షిమోషీ, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**జిలెటిన్ స్టిక్స్ నిల్వలే కారణమా?**

వెంకన్న జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి నిర్మాణ పనుల్లో అడ్డు వచ్చే రాళ్లను పేల్చివేస్తుంటాడు. ఈ క్రమంలో అందుకు అవసరమైన జిలెటిన్ స్టిక్స్‌ను అనుమతి లేకుండా ఇంట్లో పెద్దఎత్తున నిల్వ చేసుకోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడిన పురుషోత్తం ఫిర్యాదు మేరకు కదిరి గ్రామీణ పోలీసులు వెంకన్న, అతని కుమారుడు సంపత్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసున్నట్లు తెలిసింది.

**మంత్రి సవిత దిగ్భ్రాంతి**

ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. దర్యాప్తుచేయాలని ఎస్పీని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డ్రైవర్ల ఆటో, ట్యాక్సీ లైసెన్స్‌ల రద్దు..

### ఆ ప్రభుత్వం కీలక నిర్ణయం.. అసలు మ్యాటర్ ఇదే!

బిజినెస్ వాయిస్



ఆటో, ట్యాక్సీ డ్రైవర్లందరికి షాకిచ్చింది ఆ ప్రభుత్వం. డ్రైవర్ల ఆటో, ట్యాక్సీల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించింది. అయితే ఆ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కొందరు మద్దతు తెలుపుతుండగా, మరి కొందరు వ్యతిరేకత తెలుపుతున్నారు. అయితే లైసెన్సింగ్ నిబంధనలలో భాగమేనని.. డ్రైవింగ్ లైసెన్స్‌లో ఆ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతోంది. లైసెన్స్ పొందిన ఆటో-రిక్షా, టాక్సీ డ్రైవర్లందరికీ మరాఠీ భాషా పరిజ్ఞానం తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన, కఠినమైన నిబంధనను అమలు చేసింది. భాష రాకుంటే ఆటో, ట్యాక్సీల లైసెన్స్‌లను రద్దు చస్తామని హెచ్చరించింది. మహారాష్ట్ర దినోత్సవంగా పాటించే మే ??1వ తేదీ నుండి ఈ నిబంధన అమల్లోకి రానుంది. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఈ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, మరికొందరు తమ జీవనోపాధి, అవినీతికి ఆస్కారంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**'మరాఠీ' భాషా పరిజ్ఞానాన్ని తప్పనిసరి:**

రాష్ట్రవ్యాప్తంగా మోటార్ రవాణా శాఖ తనిఖీ డ్రైవ్‌లను నిర్వహిస్తుందని రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, డ్రైవర్లకు మరాఠీ చదవడం, రాయడం వచ్చో లేదో ధృవీకరించడానికి 59 ప్రాంతీయ, ఉప-ప్రాంతీయ కార్యాలయాలలో వారిని స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధన ఇప్పటికే లైసెన్సింగ్ నిబంధనలలో భాగమేనని, అయితే ఫిర్యాదులు రావడంతో ఇప్పుడు దీనిని కఠినంగా అమలు చేస్తున్నామని సర్నాయక్ స్పష్టం చేశారు. "ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, ఛత్రపతి సంభాజీనగర్, నాగ్‌పూర్ నుండి చాలా మంది డ్రైవర్లు మరాఠీ మాట్లాడలేకపోతున్నారని లేదా ఉద్దేశపూర్వకంగా మాట్లాడటం లేదని ఫిర్యాదులు అందాయి" అని ఆయన పేర్కొన్నారు. అధికార భాషను గౌరవించడం ఒక "వృత్తిపరమైన బాధ్యత" అని ఆయన తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు.

**ప్రభుత్వ నిర్ణయానికి చాలా మంది మద్దతు**

అయితే, ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు లభించింది. ఈ చర్యను స్వాగతిస్తూ, అనిల్ దేశాయ్ ఇది కొత్త నిబంధన కాదని, ఇప్పటికే ఉన్న నిబంధనను అమలు చేయడమేనని వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ, "ఇందులో తప్పేమీ లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన చాలా మంది డ్రైవర్లు ఇప్పటికే మరాఠీ మాట్లాడతారు. అది అధికారిక భాష కాబట్టి, ఇది పూర్తిగా సముచితమైనది" అని అన్నారు. కొంతమంది డ్రైవర్లు కూడా ఈ అభిప్రాయాన్ని సమర్థించారు. మరాఠీ నేర్చుకోవడం వల్ల ప్రయాణికులతో మరింత బాగా మమేకమవ్వగలుగుతున్నామని పేర్కొన్నారు. 1990 నుండి ముంబై సెంట్రల్‌లో టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అశోక్ దుబే, తనకు ఆ భాషలో సుమారు 50% అర్థమవుతుందని, ఒక నిర్దిష్ట రాష్ట్రంలో పనిచేసే ప్రతి ఒక్కరూ అక్కడి స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. 27 ఏళ్లుగా భిండి బజార్ ప్రాంతంలో నివసిస్తున్న జార్ఖండ్ వాసి అయిన బసంత్ యాదవ్, తాను క్రమంగా మరాఠీ నేర్చుకున్నానని, ఇప్పుడు దానిని అనర్గళంగా మాట్లాడగలనని అన్నారు.

**కొంతమంది వాహన డ్రైవర్ల ప్రశ్నలు ఏంటంటే..**

ములుండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ రూపేష్ చౌదరి ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. "డ్రైవర్లు ఇప్పటికే హిందీ, మరాఠీ లేదా ఇతర భాషలలో మాట్లాడుతున్నారు. ఒకవేళ మరాఠీని తప్పనిసరి చేస్తే, దాన్ని నేర్చుకోవడానికి ప్రభుత్వం వారికి సహాయం చేస్తుందా?" అని ఆయన అడిగారు. జరిమానాలు విధించడం కాకుండా, డ్రైవర్లకు సహాయం, శిక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

### 2021లో కొన్న బంగారానికి
## ఇప్పుడు లాభం ఎంతో తెలిస్తే మతిపోతుంది!





ప్రతి సంవత్సరం చిన్న మొత్తాలలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలంలో పెద్ద లాభాలను అందిస్తుందని ఈ ఉదాహరణ స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అక్షయ తృతీయ వంటి సాంప్రదాయ రోజులలో బంగారం కొనడం కేవలం నమ్మకానికి సంబంధించిన విషయంగానే కాకుండా.. అక్షయ తృతీయ రోజున బంగారం నగలు ధరిస్తే ఏడాది పొడవునా ఇంట్లో సంపద పెరుగుతుందని భారతీయులలో ఒక నమ్మకం ఉంది. దీని కారణంగా ప్రజలు ఆ రోజున సాధారణం కంటే ఎక్కువగా బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ -- అమెరికా మధ్య ఇటీవల నెలకొన్న యుద్ధ ఉద్రిక్తత బంగారం, వెండి ధరలలో అస్థిరతను సృష్టించింది. దీని కారణంగా ఈ సంవత్సరం అక్షయ తృతీయ నాడు బంగారం అమ్మకాలు ఎలా ఉంటాయోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

**2021లో బంగారం కొనుగోలు చేసిన వారు ఇప్పుడు ఎంత లాభం?**

బంగారం ధర రోజురోజుకీ పెరుగుతోంది. దీని కారణంగా బంగారం కొనడం ఒక మంచి పెట్టుబడిగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో మీరు 2021 నుండి ప్రతి సంవత్సరం అక్షయ తృతీయ నాడు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారు నాణెం కొనుగోలు చేసి ఉంటే, ఈ రోజు అది ఎంత లాభాన్ని ఇచ్చి ఉండేదో లెక్కలు వేస్తే ఆశ్చర్యమేస్తుంది. 2021లో ఒక సవరన్ బంగారం ధర రూ.46,500గా ఉంది. ఆ తర్వాత 2022లో అది రూ. 51,510, 2023లో రూ. 61,300, 2024లో రూ. 73,240, 2025లో రూ. 96,500గా ఉంది. ఏటా బంగారం ధర ఎలా పెరుగుతూ వస్తోందో ఇది స్పష్టంగా చూపిస్తుంది. దీని ప్రకారం, మీరు 2021లో 10 గ్రాముల బంగారు నాణెం కొనుగోలు చేసి ఉంటే, 5 సంవత్సరాలలో దాదాపు 135 శాతం లాభం పొంది ఉండేవారు. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,55,000గా ఉంది. అంటే మన లాభం ప్రతి సంవత్సరం 39 నుండి 44 శాతం వరకు పెరిగిందని అర్థం. బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల బంగారు నిల్వలు పెరగడం, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు అని చెబుతున్నారు. ప్రతి సంవత్సరం చిన్న మొత్తాలలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలంలో పెద్ద లాభాలను అందిస్తుందని ఈ ఉదాహరణ స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అక్షయ తృతీయ వంటి సాంప్రదాయ రోజులలో బంగారం కొనడం కేవలం నమ్మకానికి సంబంధించిన విషయంగానే కాకుండా, ఒక బలమైన పెట్టుబడిగా కూడా మారింది. అందుకే ఆ రోజున ప్రజలు బంగారు ఆభరణాలు కొనడానికి దుకాణాలకు ఉత్సాహంగా తరలివస్తారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 17 ఏప్రియల్ 2026

www.viswamvoice.com




# మా పంటలను కాపాడండి - రైతుల ఆవేదన





**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కోతలు కోసే టైంలో కాలువల ద్వారా వరదలా నీరు ప్రవహిస్తోంది. నీరు కట్టేయండి మహాప్రభో అని ఇరిగేషన్ జేఈకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆయన ఆలకించడం లేదు. నీరు రాకుండా మా పంట పొలాలను కాపాడండి" అని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం, నడవపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతల సీజన్ నడుస్తోందని, ఈ దశలో కాలువల ద్వారా నీరు విడుదల చేయడంతో పొలాల్లోకి నీరు చేరి కోత కోసి పనమీద ఉన్న పంట, కోతకు సిద్ధంగా ఉన్న పంట నీట మునుగుతోందని రెండు గ్రామాల రైతులు వాపోతున్నారు. దీనివల్ల పంట నష్టం జరిగి, గింజ రంగు మారిపోయి, దిగుబడి తగ్గిపోతుందని, కోసిన పన కూడా మొలకెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇరిగేషన్ శాఖ జేఈ దృష్టికి తీసుకెళ్లి కోతలు పూర్తయ్యే వరకు నీరు ఆపాలని వేడుకున్నామని, అయినా స్పందన లేదని రైతులు తెలిపారు. కుండలేశ్వరం, నడవపల్లి గ్రామాల్లో కోతల సీజన్ ముగిసే వరకు కాలువలకు నీరు నిలిపివేయాలని, రైతుల పంటలను కాపాడాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, స్పందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శ్రీరామ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలంటూ డిమాండ్

## పోలీస్ స్టేషన్ ఎదుట దళిత నాయకుల ఆందోళన

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత మహిళను అవమానించిన ఘటనపై కాజులూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చెయ్యాలంటూ గురువారం బాధిత మహిళతో పాటు పలువురు దళితసంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బాధిత మహిళ సన్నపు లక్ష్మీ మాట్లాడుతూ తన భర్త కిరణ్, ఆకుల నాగదేవి భర్త నాయుడు, నామా సుబ్బారావులు కలసి చేస్తున్న టైల్స్ వ్యాపారం లావాదేవీలలో తలెత్తిన వివాదంపై తమకు తగువు చెప్పాలని తానూ, ఆకుల నాగదేవి ఈ నెల తొమ్మిదవ తేదీ గురువారం గ్రామానికి చెందిన అన్యం శ్రీరామ్ ఇంటికి వెళ్ళి సాయం కోరగా అతను మహిళలమని కూడా చూడపండా అమానుషంగా ప్రవర్తిస్తూ అవమానించారని ఆరోపించారు. దీనిపై ఈ నెల 11 వ తేది. శనివారం కులసంఘాల నేతలతో వచ్చి గొల్లపాలెం పోలీసులకు పిర్యాదులు చేయగా పోలీసులు విచారణ చేసి కేసు నమోదు



చెయ్యకుండా తాత్సర్యం చేస్తున్నారని ఆరోపించారు. అన్యం శ్రీరామ్ కూటమి పార్టీలో ఉన్న దళిత నాయకులతో ప్రెస్మీట్లు పెట్టించి దళితుల మధ్య విబేదాలు సృష్టించి గొడవలకు ప్రేరేపిస్తున్నారన్నారని మండిపడ్డారు. అనంతరం వైఎస్సార్సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్ర, బిఎస్పి జిల్లా అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం, జైబీమా భారతాపార్టీ అధ్యక్షులు ఏనుగుపల్లి కృష్ణ, అకిల భారత స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పత్తిపాటి బుల్లిరాజు, మాలమహానాడు అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు తదితరులు మాట్లాడుతూ తామంతా బాదితులకు బాసటగా ఉన్నామని పోలీసులు కేసునమోదుచేసి తగిన చర్యలు తీసుకొనకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పోతురాజు బాబురావు, పీతల రాజేష్, గుబ్బల ఆదినారాయణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం సర్కిల్ కార్యాలయాన్ని

# తనిఖీ చేసిన ఎస్పీ రాహుల్ మీనా



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

రామచంద్రాపురం సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించారు. తనిఖీలో భాగంగా సర్కిల్ కార్యాలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలని, ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. రామచంద్రాపురం సర్కిల్ పరిధిలో ఉన్న ప్రస్తుత సమస్యలను ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని, శాంతి కమిటీలను ఏర్పాటు చేసి ఇరు వర్గాల ప్రజలతో చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ అవసరమైన లైటింగ్, రేడియం స్టిక్కరింగ్, స్పీడ్ నియంత్రణ అవరోధాలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని ద్రాక్షారామం, కోటిపల్లి ఆలయాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోటిపల్లి నదీ పరివాహక ప్రాంత భద్రతపై ప్రత్యేకంగా ఆరా తీసి, అక్కడ అమలు చేస్తున్న భద్రతా చర్యలు, ప్రమాద నివారణ చర్యలపై నివేదికలు కోరారు. అనంతరం రామచంద్రాపురం, ద్రాక్షారామం, పామర్రు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు మరియు సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్‌బీసీఐ పుల్లారావు, ద్రాక్షారామం, పామర్రు, రామచంద్రాపురం ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాయవరం విజ్ఞాన్ కాలేజీ విద్యార్థుల మెరుపు ఫలితాలు

## సత్తాచాటిన విద్యార్థులు, పలువురి అభినందనలు

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో రాయవరం విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతూ మరోసారి తమ సత్తా నిరూపించారు. అత్యధిక మార్కులు సాధిస్తూ విద్యాసంస్థకు కీర్తి తీసుకువచ్చారు. విజ్ఞాన్ కళాశాల



లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజ్ఞాన్ అకాడమిక్ డైరెక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ద్వితీయ సంవత్సరం ఎంపీసి విభాగంలో సుందర హరి శ్రీ మహాలక్ష్మి 1000కి గానూ 990 మార్కులు సాధించి టాప్‌లో నిలిచిందని, మాడపాటి లక్ష్మి గణ పూజిత 989 మార్కులు, ఎస్. వీరలక్ష్మి, కె. నాగ శరణ్య తలా 985 మార్కులు సాధించారని, ప్రథమ సంవత్సరం ఎంపీసి లో బడిగంట దత్త సాయి హర్ష వర్ధన్ 463/470, కె. పవన్ ఆదిత్య శివ రెడ్డి 461 మార్కులు, ఎన్. దివ్య వీర నాగ సత్య 459 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చడంతో పాటు, ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఎంపిసి లో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. అచ్చిరెడ్డి తెలిపారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫుల్ సైలెంట్ మోడ్‌లో బొత్స..?

వైసీపీ సీనియర్ నాయకుడు శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్ లోకి వెళ్ళిపోయారు. వారం రోజుల క్రితం ఆయన విశాఖలోని తన క్యాంప్ ఆఫీసులో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మంత్రి అచ్చెన్నాయుడు తన మీద చేసిన కామెంట్స్ ని ఖండించే క్రమంలో వెక్కి ఏడ్చారు. ఆ తరువాత ఆయన ఎక్కడా మళ్లీ బయటకు కనిపించడం లేదని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో బొత్స అచ్చెన్న తన మీద తప్పుడు ఆరోపణలు చేసారు అని ఆరోపించారు. కానీ దానికి కూటమి మంత్రులు కీలక నేతలు స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చేశారు.

**క్లిప్పింగ్స్‌తో సహా :** బొత్స కాంగ్రెస్ తరఫున ఉమ్మడి ఏపీకి ప్రెసిడెంట్ గా ఉన్నపుడు వైఎస్సార్‌ని జగన్‌ని ఆయన కుటుంబాన్ని ఎంత గట్టిగా టార్గెట్ చేసి విమర్శించారో నాటి వార్తా క్లిప్పింగ్స్ ని వీడియో బైట్స్‌తో సహా టీడీపీ నేతలు తెచ్చి జనం ముందు పెట్టారు. నిజానికి అచ్చెన్నాయుడు జస్ట్ ఒక మాట అన్నారు కానీ అంత కంటే ఎక్కువగానే తీవ్ర విమర్శలే బొత్స జగన్ మీద వైఎస్సార్ ఫ్యామిలీ మీద చేశారు అని టీడీపీ నేతలు గుర్తు చేస్తూ మరీ బొత్సని కార్నర్ చేశారు. ఈ మొత్తం పరిణామాలను బొత్స ఊహించలేదా ఊహించినా కూడా వెక్కి ఏడ్చి అక్కడితో సరి అనుకున్నారా అన్నది అయితే తెలియడం లేదని అంటున్నారు.


**అసలు పాయింట్ అక్కడే :** ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్లుగా బొత్స ఏడుపు అచ్చెన్నాయుడు తనను అన్నారని కాదని జగన్ వీటిని ఏ విధంగా రిసీవ్ చేసుకుంటారా అన్నదే ఆయన బాధ అని అంటున్నారు. మొత్తం మీద బొత్స అయితే ప్రస్తుతం వేచి చూసే ధోరణిలో ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. ఇక బొత్స మీద టీడీపీ నేతలు మంత్రులు అంతా కలసి పెద్ద



ఎత్తున విమర్శలు చేసినా వైసీపీ నుంచి ఆయనకు మద్దతుగా పెద్దగా ఎవరూ మాట్లాడింది లేదని గుర్తు చేస్తున్నారు. దాంతో వైసీపీ అధినాయకత్వం బొత్స విషయంలో ఏ విధమైన వైఖరితో ఉంది అన్నదే పాయింట్ అని అంటున్నారు. నిజానికి రాజకీయాల్లో విమర్శలు అన్నవి సహజమే అయినా మరీ వ్యక్తిగతానికి పోయి చేసిన విమర్శలు అయితే గట్టిగానే గుచ్చుకుంటాయి. పరస్పరం అవసరం కోసం నాయకులు కలసినా పాత వాటిని మరచిపోలేరు, దీంతో పాత సంగతులు అన్నీ గుర్తు చేస్తూ ఇపుడు టీడీపీ కావాలనే కెలికిందా లేక బొత్స ఏడ్చి మరీ దానిని ఇంకా పెంచేశారా తెలియదు కానీ ఇపుడు మౌనమే నా భాష అని బొత్స అంటున్నారు. మరి ఆయన ఎపుడు పెదవి విప్పుతారు, వైసీపీ హైకమాండ్ ఆయనని ఏ విధంగా యాక్టివ్ చేస్తుంది అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు.

# బీటెక్ రవి ఇలా అయితే కష్టమే బాసు...!


అయినప్పటికీ వచ్చే ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లో జగన్ను ఓడించి పులివెందులను కైవసం చేసుకోవాలన్నది టిడిపి రాజకీయ వ్యూహాల్లో ప్రధానమైనది. పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ అధినేత జగన్ ను ఓడించాలి అన్నది టిడిపి పెట్టుకున్న భారీ లక్ష్యం. వాస్తవానికి గత ఎన్నికల సమయంలోనే బలంగా పోరాడి, కూటమి ప్రభావం ఉన్న నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గం కైవసం చేసుకోవాలని భావించింది. కానీ, రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఓడిపోయినా కడపలో కూడా బలమైన నియోజకవర్గాలను పోగొట్టుకున్నా.. పులివెందుల వంటి వైఎస్‌కు పట్టున్న నియోజకవర్గంలో జగన్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. అయినప్పటికీ వచ్చే ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లో జగన్ను ఓడించి పులివెందులను కైవసం చేసుకోవాలన్నది టిడిపి రాజకీయ వ్యూహాల్లో ప్రధానమైనది. దీనిని దృష్టిలో పెట్టుకునే ఇక్కడ అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ముఖ్యంగా స్థానిక రైతులకు సాగునీటిని అందిస్తున్నారు. పట్టిసీమ నుంచి కూడా నీటిని పులివెందులకు తరలిస్తున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాల విషయంలో కూడా మెరుగైన సంతృప్తి వచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, ఇంత జరుగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ఎంత చేస్తున్నప్పటికీ టిడిపి పరంగా కార్యక్రమాలు నిర్వహించే విషయంలోనూ.. కేడర్ను ముందుకు నడిపించే విషయంలోనూ ఇక్కడ ఇన్చార్జిగా ఉన్న సీనియర్ నాయకుడు గత ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన బీటెక్ రవి వెనుక పడడం చంద్రబాబుకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. వచ్చే ఎన్నికలనాటికి ఇక్కడ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో మరింతగా పని చేయాలని పదేపదే చెప్పినప్పటికీ ఎందుకు వినిపించుకోవడం లేదని ఇటీవల కడపలో పర్యటించిన సందర్భంగా బీటెక్ రవికి ఆయన సూటిగా చెప్పుకొచ్చారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ కూడా పలు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి సమీక్షించినప్పుడు బీటెక్ రవి వెనుకబడిన విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఇలా కుదరదని భవిష్యత్తులో మనం పెట్టుకున్న లక్ష్యం సాధించి తీరేందుకు ఇప్పటినుంచి కష్టపడాలని తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే గత ఏడాది జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతోపాటు బీటెక్ రవి సతీమణి కూడా విజయం సాధించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా తన హవా ప్రారంభమైందని రవి భావిస్తున్నట్టు స్థానికంగా చర్చ నడుస్తోంది. కానీ పులివెందులలో వైయస్ అనుకూల వర్గాలు వైయస్ కుటుంబానికి అభిమాన వర్గాలు ఎక్కువగా ఉన్నాయి.



దీంతో నియోజకవర్గంపై నిరంతరం దృష్టి పెట్టాలన్నది చంద్రబాబు ఆలోచన. ఆ దిశగా బీటెక్ రవి అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే వచ్చే ఎన్నికలనాటికి మరోసారి గెలుపు గుర్రం ఎక్కుతారా లేదా అనేది సందేహంగా మారుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

# వైసీపీ మద్దతు, కానీ షరతులు వర్తిస్తాయంటూ మెలిక!

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 131వ రాజ్యాంగ సవరణకు వైసీపీ మద్దతు ప్రకటించింది. మహిళా రిజర్వేషన్లతోపాటు డీలిమిటేష్ బిల్లులు తమకు ఆమోదయోగ్యమేనని వైసీపీపీ నేత మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఏపీ ప్రయోజనాలకు ఏ మాత్రం నష్టం జరిగినా ఈ విషయంలో మద్దతు చెప్పలేమని తేల్చిచెప్పారు. ప్రస్తుతం దేశం మొత్తం పార్లమెంటు సమావేశాలను ఆసక్తిగా గమనిస్తోంది. రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం లేకపోయినా కేంద్ర ప్రభుత్వం రెండు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వీటి ఆమోదానికి కేంద్రం ఎలా ప్రయత్నిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల్లో తటస్థ వైఖరి అవలంబిస్తున్న వైసీపీ అధికార కూటమికి మద్దతు ప్రకటించింది. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమికి వైసీపీ బాసటగానే నిలుస్తూ వస్తోంది. ఇప్పటివరకు ఏ బిల్లును వైసీపీ వ్యతిరేకించలేదు. ఈ పరిస్థితుల్లో మహిళా బిల్లు విషయంలో వైసీపీ నిర్ణయాన్ని ముందే ఊహించినా, గతంలో ఎన్నడూ లేనివిధంగా షరతులు వర్తిస్తాయని చెప్పడమే విశేషమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రం ప్రస్తుతం ప్రవేశపెడుతున్న డీలిమిటేషన్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ఆధ్వర్యంలోని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వైసీపీ ఈ విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటుందని భావించారు. కానీ, వైసీపీ ఎప్పటిలానే ఎన్డీఏ కూటమికి భేషరతుగా మద్దతు ప్రకటించింది. అయితే సీట్లు పెంపు విషయంలో ఏపీకి అన్యాయం జరిగితే తాము మద్దతు ఇచ్చేది లేదని ఎంపీ మిథున్ రెడ్డి హెచ్చరించడం హాట్ టాపిక్‌గా మారింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటులో మూడో వంతు సభ్యుల ఆమోదం అవసరమని చెబుతున్నారు. ఈ క్రమంలో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదానికి 367 మంది సభ్యుల బలం ఉండాలని అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ మిత్రపక్షాలకు 298 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. వైసీపీ వంటి తటస్థ పార్టీలతోపాటు విపక్షంలోని బిల్లుకు అనుకూలంగా ఉన్న పార్టీల మద్దతుతో బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర సర్కారు ప్లాన్ చేస్తోంది. ఈ ప్రయత్నాల్లో భాగంగానే వైసీపీని బీజేపీ అగ్రనాయకత్వం సంప్రదించిందని అంటున్నారు. మహిళా రిజర్వేషన్లకు తమ పార్టీ తొలి నుంచి అనుకూలమేనని ఆ పార్టీ ఎంపీలు ప్రకటించారు.





# రామచంద్రపురంలో అభివృద్ధి పరుగులు

## 22 నెలల్లో రూ.40 కోట్లతో అభివృద్ధి - ఒక్కరోజే రూ.68 లక్షలుతో 13 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మునిసిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీకారం చుట్టారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ప్రజా సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు పనులను ప్రారంభిస్తూ పట్టణ అభివృద్ధికి మరింత వేగం తీసుకువచ్చారు. గడిచిన 22 నెలల్లో రామచంద్రపురం పట్టణంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి సుభాష్ వెల్లడించారు. మున్సిపల్ సాధారణ నిధులు 14 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 2.40 కోట్లు, ప్రత్యేక నిధులు 3 కోట్లు, రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన 3 కోట్లు, ప్రత్యేక నిధులు రెండు పాయింట్ 2.25 కోట్లు తో అభివృద్ధి చేశామన్నారు. అలాగే పట్టణంలో త్రాగునీరు పైపులైన్లు కోసం అమృత్ 2.0 పథకం కింద 15.75 కోట్లు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో నిర్వహిస్తూ ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ అభివృద్ధిలో భాగంగా గురువారం ఒక్కరోజే రూ.68 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టమని మంత్రి



సుభాష్ వెల్లడించారు.

**ఈ రోజు వార్డుల వారీగా పనుల వివరాలు, వ్యయం:**

16వ వార్డు - వెటర్నరీ కాలేజ్ వద్ద సీసీ డ్రెయిన్ నిర్మాణం - రూ.5,04,027.

17వ వార్డు - ముచ్చిమిల్లి బ్రిడ్జి వద్ద పాఠశాల ముందు సీసీ రోడ్ - రూ.3,87,978.

9వ వార్డు - వైష్ణవి స్కూల్ వీధిలో సీసీ డ్రెయిన్ - రూ.4,44,211.

11వ వార్డు - బ్రాడిపేటలో దోబీఖానా, వాషింగ్ ప్లాట్‌ఫార్మ్, వాటర్ ట్యాంక్ రూ.5,11,415.

23వ వార్డు - శివాలయం వీధిలో సీసీ రోడ్లు - రూ.5,48,023.

24వ వార్డు - కుమ్మర్ల వీధిలో డ్రెయిన్, రోడ్, కల్వర్ట్ పనులు - రూ.4,68,315.

26వ వార్డు - సీసీ రోడ్ & డ్రెయిన్ నిర్మాణం - రూ 5,37,126.

28వ వార్డు - రామదుర్గ వీధిలో సీసీ రోడ్ రూ.5,02,577.

28వ వార్డు - డ్రెయిన్ నిర్మాణం - రూ.3,96,369.

1వ వార్డు -డంపింగ్ యార్డ్ వద్ద నీటి సరఫరా - రూ.2,50,982.

1వ వార్డు - సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ - రూ.4,18,495.

1వ వార్డు -టిడ్కో అపార్ట్మెంట్స్ వద్ద ఓపెన్ జిమ్ పరికరాలు - రూ.3,76,592.

5వ వార్డు - వైఎస్ఆర్ నగర్ మెయిన్ రోడ్ మరమ్మతులు - రూ.3,77,054.

మొత్తం పనుల అంచనా విలువ: 68 లక్షలు. అలాగే సి ఎస్ ఆర్ నిధుల ద్వారా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో 16 లక్షలతో డయాలసిస్ యూనిట్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా 8 లక్షలతో లెప్రసీ కాలనీలో ఇల్లు రిపేరు పనులు, సుమారు 3500 మంది నిరుద్యోగులకు ఉద్యోగమేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించమన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా రామచంద్రపురం పట్టణంలో మరిన్ని మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ప్రతి వార్డులో అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జెనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్ ఆర్ రాజు, మున్సిపాలిటీ డి ఈ శ్రీకాంత్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు,సలాది నాయుడు, గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, కావల నానాజీ, నారపురెడ్డి బలరాం, కడియాల రాఘవన్, గడి గోవిందు, కట్టా నాగేశ్వరావు,దిగుమర్తి వీరబాబు, గొల్లపల్లి కృష్ణ, మురళి, మేడిశెట్టి సూర్య నారాయణ, పలివెల రాజు,రెడ్డి సురేష్, గుబ్బల రమణ, దేవరపల్లి చక్రి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయ లక్ష్మి, దొమ్మలపాటి విజయ లక్ష్మి,బళ్ళ లక్ష్మి, పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనగణన ప్రారంభం - ప్రజల భాగస్వామ్యం అవసరం


## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమైన భారతదేశ 17వ విడత జాతీయ జనగణన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం డిజిటల్ జనగణన (స్వీయ గణన)లో భాగంగా కుటుంబ వివరాలను నమోదు చేసి విజయవంతంగా ప్రక్రియను పూర్తి చేశారు. డిజిటల్ విప్లవంలో భాగంగా తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ 17వ విడత జనగణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతోందని, ఇది పారదర్శకతను, వేగాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు లేదా కంప్యూటర్ల ద్వారా ప్రభుత్వ పోర్టల్‌లో లాగిన్ అయ్యి తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయం నేటి నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. తొలి దశలో ఈ నెల 30 వరకు ఈ సదుపాయం ఉంటుందని తెలిపారు. జిల్లా



కలెక్టర్ స్వయంగా ఈ పద్ధతి ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసి, ఈ ప్రక్రియ ఎంత సులభమో ప్రజలు గుర్తించి ప్రతి ఒక్కరూ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డేటా భద్రత కలిగిన ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జనాభా గణనకు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రజలు అందించే వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, ఎటువంటి అపోహలకు లోను కాకుండా ఖచ్చితమైన సమగ్ర సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. జనగణన ద్వారా సేకరించిన గణాంకాల ఆధారంగానే భవిష్యత్తులో విద్య, వైద్య, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు ఈ జాతీయ బాధ్యతలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. స్వీయ గణన పద్ధతిని ఉపయోగించుకోవడం ద్వారా సమయం ఆదా అవ్వడమే కాకుండా ఖచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి అందుతుందని తెలిపారు. చివరగా జిల్లాలోని విద్యావంతులు, యువత మరియు స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు ఈ డిజిటల్ జనగణనపై అవగాహన కల్పించాలని కోరారు. నిర్దేశించిన గడువులోగా జిల్లాలో 100 శాతం జనగణన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్ధగణాంక అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వైద్యాధికారిగా సుదీప్తి

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా ఎం.సుదీప్తి నియమితులయ్యారు. పుట్టపర్తి మెడికల్ కాలేజీలో డీఆర్థో అండ్ డీఎన్బీ ఆర్థో విభాగంలో డిగ్రీ కోర్సులను ఆమె పూర్తి చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్త వైద్యుల నియామకంలో భాగంగా ప్రభుత్వం సుదీప్తిని స్థానిక వైద్యాధికారిగా నియమించింది.

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన

# ముమ్మిడివరం నియోజకవర్గం పల్లెపాలెంలో ప్రారంభం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గంలోని పల్లెపాలెం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ విద్యుత్ అందించే "ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన" కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం తరఫున గౌరవ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఈరోజు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ సూర్య ఘర్ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్యుత్ భారం తగ్గి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. సోలార్ విద్యుత్ వినియోగం పెరగడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజలు మరియు మీడియా మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

ముమ్మిడివరం నియోజకవర్గంలో

# రైతులకు మరింత భరోసా

## అయినాపురం పిఎసిఎస్ ధాన్య కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గంలోని అయినాపురం గ్రామంలో పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గౌరవ ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ముఖ్యంగా భావిస్తూ కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పి) ప్రకారం ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా, తమ పంటను నేరుగా ప్రభుత్వానికి అమ్ముకునే విధంగా పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఇకపై రైతులు తమ ధాన్యాన్ని సరైన ధరకు, పారదర్శకంగా అమ్ముకునే అవకాశాన్ని ఈ కేంద్రం కల్పిస్తుందని, రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి సందేహాలు లేకుండా, స్వేచ్ఛగా తమ పంటను ఈ కేంద్రాల ద్వారా విక్రయించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, రైతులు, గ్రామ ప్రజలు మరియు మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగింది.

# దేవాలయంలో హుండీ దోపిడీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాలయంలో హుండీ పగులకొట్టి నగదు, సీలింగ్ ఫ్యాన్ ను అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామంలో గల శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత అగస్తీశ్వర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 13న రాత్రి సమయంలో హుండీ పగులగొట్టి రూ.5 వేల నగదు అపహరించడంతో పాటు దేవాలయంలోని సీలింగ్ ఫ్యాన్‌ను దొంగిలించిన కేసులో నిందితుడైన చెల్లూరు గ్రామానికి చెందిన కానూరు మల్లేష్ (దుర్గారావు కుమారుడు) ను గురువారం అదుపులోకి తీసుకుని విచారించినట్లు రాయవరం ఎస్సై డి. సురేష్ బాబు తెలిపారు. అనంతరం నిందితుడిని అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు నందు హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని ఎస్సై తెలిపారు.

# జనాభా స్వీయ గణనతోనే దేశాభివృద్ధి సాధ్యం

## మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశ జనాభా గణన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం రామచంద్రపురంలోని తన స్వగృహంలో స్వీయ గణన పోర్టల్ ద్వారా తన కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్వీయ గణన విధానాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఖచ్చితమైన జనాభా గణన వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందుతాయని, ఇది దేశాభివృద్ధికి దిక్సూచి వంటిదని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని, గణన సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనాభా గణన సిబ్బంది మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని

# దర్శించుకున్న టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య



**సఖినేటిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్వేది తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం రాజోలు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నియమించిన సందర్భముగా అమూల్య స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో సాదరం స్వాగతం పలికిన ఆలయ ఈఓ, పాలకమండలి సభ్యులు అమూల్య గారిని దుస్సాలువా కప్పి గజమాల వేసి సత్కరించిన స్థానిక టిడిపి శ్రేణులు పూజాధికాలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి కరుణా కటాక్షములు మనపై మెండుగా ఉన్నాయని కనుకనే నియోజకవర్గంలో సుభిక్షంగా ఉందని ఎన్ని విపత్తులు ఎదురైనా నియోజకవర్గ ప్రజలు సురక్షితంగా ఉన్నామని అన్నారు. నాపై పార్టీ అధిష్టానం పెట్టిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ నియోజకవర్గం ప్రజలకు కూటమి శ్రేణులకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలలో సహాయకారిగా వెన్నుముకలా ఉంటానని అన్నారు. ఈ దైవదర్శనంలో అమూల్య వెంట ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు లంకే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, అనుచూరి సునీత పురుషోత్తం, అడబాల సాయిబాబా, తాటిపాక సర్పంచ్ శ్రీమతి కోటిపల్లి రత్నమాల, చింతా లక్ష్మి కొత్తపల్లి విజయలక్ష్మి, రాజోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్ బాబు, తిరుమాని ఆచార్య, గ్రామశాఖ అధ్యక్షులు పోతాబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ జనాభా గణన - 2027లో భాగంగా రాజోలు నియోజకవర్గంలో

# గృహ జాబితా, గృహ గణన ప్రారంభం



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం చేపట్టిన భారతదేశ జనాభా గణన - 2027 కార్యక్రమంలో భాగంగా రాజోలు నియోజకవర్గంలో గృహ జాబితా మరియు గృహ గణన కార్యక్రమం రాజోలు శాసనసభ్యులు శ్రీ దేవ వరప్రసాద్ నివాసం నుండే ప్రారంభమైంది. ఈ కార్యక్రమం స్థానిక మలికిపురం మండల తహసిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి ఖచ్చితమైన జనాభా గణాంకాలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. జనాభా గణన ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై సమగ్ర సమాచారం ప్రభుత్వం వద్దకు చేరుతుందని, ఆ సమాచారాన్ని ఆధారంగా తీసుకొని వివిధ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. అందువల్ల ప్రజలందరూ ఈ గణన ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మలికిపురం మండల తహసిల్దార్ శ్రీనివాస్ గౌరవ ఎమ్మెల్యే శ్రీ దేవ వరప్రసాద్ జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం



## ప్రజా దర్బార్‌లో మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన క్యాంపు కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా వినతులను స్వీకరించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య మరియు దివ్యాంగ పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్న మంత్రి, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల విషయంలో ఎటువంటి జాప్యాన్ని సహించబోమని, అర్హులకు న్యాయం జరిగేలా వేగంగా స్పందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చడం తన బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ చేరాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రజా దర్బార్ కార్యక్రమాలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తాయని, అందరి సహకారంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, నాయకులు కంచుమర్తి బాబురావు, కాటే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పూడిలో చదువుల సరస్వతి రత్నశ్రీ



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరిక కుటుంబంలో పుట్టి చదువుల్లో తనకేమీ పేదరికం లేదని నిరూపించింది ఉప్పూడి కి చెందిన ఒక బాలిక ప్రభుత్వ కళాశాలలో చదివి అత్యధికంగా మార్కులు సాధించింది. దేగల రత్న శ్రీ. కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రత్న శ్రీ చిన్ననాటి నుండి ప్రభుత్వ పాఠశాల విద్యను అభ్యసించి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో 524 మార్కులు, ఇంటర్మీడియట్ లో 974 మార్కులు సాధించి ప్రతిభను కనపర్చింది. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రత్నశ్రీ ప్రతిభకు పలువురు అభినందించారు. ఇటువంటి చదువుల్లో ఆణిముత్యాలను ప్రభుత్వం గుర్తించి మరిన్ని శిఖరాలను అవరోదించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారిఅభినంద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రవాణా శాఖ అధికారి డి శ్రీనివాసరావు గురువారం రత్నశ్రీ ఇంటికొచ్చి చదువుల సరస్వతిని ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రులను అభినందించారు. మరింత ప్రోత్సాహాన్ని అందించారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

### వార్షిక తనిఖీలలో భాగంగా

# కాకినాడ జిల్లాలో ఐజి అశోక్ కుమార్ పర్యటన

## ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని కొనసాగించాలి - ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి : ఐజి అశోక్ కుమార్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ గురువారం కాకినాడ 2 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ మరియు ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐజి వెంట ఉన్నారు. మొదట కాకినాడ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఐజీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, కేసు ఫైళ్లు, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, మిస్సింగ్ కేసుల దర్యాప్తు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరువాత ఇంద్రపాలెం, ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ స్టేషన్ రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేసి నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫింగర్ ప్రింట్ పరికరాల వినియోగాన్ని పెంచి పాత నేరస్తుల గుర్తింపును సమర్థవంతంగా చేయాలని, మహిళల భద్రత కోసం రూపొందించిన "శక్తి యాప్"పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. ఈగల్ టీమ్‌తో సమన్వయం చేసుకుంటూ గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా, ఓపికగా వ్యవహరించి వారి సమస్యలను త్వరగా పరిష్కరించడం ద్వారా 'ఫ్రెండ్లీ పోలీసింగ్'పై ప్రజల్లో విశ్వాసం పెంచాలని ఐజీ పేర్కొన్నారు. అదేవిధంగా స్టేషన్ రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్, సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవ్ రాజ్ మనీష్ పాటిల్, ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, కాకినాడ 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం అప్పలనాయుడు, రూరల్ సీఐ డి.చైతన్య కృష్ణ, ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాసు, ఎస్సైలు జి.వెంకటేష్, జానీ భాషా తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ చొరవతో కోకనాడ' ఎక్స్ ప్రెస్‌కు

# సామర్లకోటలో హాల్ట్ సౌకర్యం

## కోకనాడ ట్రైన్‌ను రోజువారి నడిపేందుకు గ్రీన్ సిగ్నల్
## ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి



**కాకినాడ, సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ - లింగంపల్లి మధ్య నడుస్తున్న 'కోకనాడ ఎక్స్ ప్రెస్ ట్రైన్‌కు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు రోజువారీ సర్వీస్ నడిపేందుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాకినాడ- లింగంపల్లి మధ్య ప్రస్తుతం రోజూ నడుస్తున్న గౌతమి ట్రైన్‌కు ప్రయాణికుల రద్దీ పెరగడంతో, వారానికి మూడు రోజులు నడుస్తున్న 'కోకనాడ' ట్రైన్‌ను రోజువారీ నడిపి, అదనంగా సామర్లకోటలో హాల్ట్ సౌకర్యం కల్పించాలని గత ఏడాది డిసెంబర్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాయడంతో పాటు పలుమార్లు వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు, దీనిపై సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ ఈనెల 21 నుండి కోకనాడ ట్రైన్ ను రోజువారి నడపడంతో పాటు, సామర్లకోట స్టేషన్ లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. దీనిపై తూర్పుగోదావరి జిల్లా మరియు కోకనాడ రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షులు వైడి రామారావు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నో ఏళ్ల కల అయిన సామర్లకోట హాల్ట్ ను సహకారం చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# 1000కి 952 మార్కులతో తనూజ ప్రథమ స్థానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏప్రిల్ 15 న విడుదల చేసిన 2026 ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షా ఫలితాల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని తంగెళ్ళ తనూజ ఎంపిసి గ్రూప్ లో 1000 కి 952 మార్కులను సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ అయిన తనూజ చిన్న తనంలోనే తల్లిని కొల్పోయి తండ్రి సత్తిబాబు ఆలనాపాలనలోనే చదువుతోంది. శంఖవరం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 6 వ తరగతిలో ప్రవేశం పొందింది. పదవ తరగతిలో 531 మార్కులతో విద్యాలయం స్థాయిలో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణురాలు అయింది.. అదే పట్టుదల, కృషి, సంకల్పంతో ఇదే కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపిసి గ్రూప్ విద్యను అభ్యసిస్తూ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షా ఫలితాల్లో కళాశాల స్థాయిలో 952 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆమె ఉత్తమ ఉత్తీర్ణత చూసిన తండ్రి సత్తిబాబు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయన రెండవ కూతుర్ని కూడా ఇక్కడే చేర్చారు. ఆమె ఇప్పుడు 9 వ తరగతి చదువుతోంది. కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, కళాశాలలు మాలాంటి వారికి ఒక వరమని, ఇక్కడ గ్రాడ్యుయేషన్ కోర్స్ కూడా ఉంటే బాగుంటుందని తండ్రి సత్తిబాబు తన ఆశావాద ఆలోచనను వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ బీరా బాలామణి కుమారి, సిబ్బంది తనూజని అభినందించారు. ఆమె తన జీవితంలో మరెన్నో విజయాలను సాధించాలని ఆశీర్వదించారు.

### లింగంపర్తిలో పోషణ పక్వాడహాజరైన

# మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి

## మెదడు అభివృద్ధి, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కుటుంబ సభ్యులు సహకారంపై అవగాహన



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆదేశాలతో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు ప్రాజెక్ట్ బద్రవరం సెక్టార్, సూపర్వైజర్ సూర్య కుమారి అద్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రనానికి ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధి అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80% అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నానమ్మ తాతయ్య అమ్మమ్మ తదితరులు పిల్లలకు మంచి మంచి కథలు చెప్పడం ద్వారా వారు మీద అభివృద్ధిపై ప్రేరణ కలుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్క్రీం చక్కెర వంటి పదార్థాలకు స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు. తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు సూచించారు. దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెద్దబాబు, లింగంపర్తి చైర్మన్ పెంటకోట మోహన్, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు, మండల తెలుగు యువత అద్యక్షులు పెంటకోట శ్రీదర్, ఎస్సీ సెల్ కన్వీనర్ నూకతాటి ఈశ్వరుడు, కూటమి నాయకులు, పెంటకోట కృష్ణ, ఎంపీడీవో రామరాజు వర్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి, పంచాయతీ కార్యదర్శి, ఐసిడిఎస్ టీచర్‌లు, హెల్పర్‌లు, ఏఎన్‌యంలు, వెలుగు విఓఏలు పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారులతల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానం ఈఓగా చక్రధరరావు భాధ్యతల స్వీరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రత్నగిరి శ్రీ వీర వెంకట దేవస్థానం పూర్తి అదనపు బాధ్యతల ఇంచార్జి కార్యనిర్వహణ అధికారిగా నల్లం సూర్యచక్రధర రావు గురువారం ఉదయం విధుల్లో చేరారు. ఈ మేరకు ఆయన దేవస్థానం పరిపాలనా విభాగం కార్యాలయం అధికారిక దస్త్రాల్లో దస్తఖతు చేసి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దేవస్థానం ధర్మకర్తల పాలక మండలి వంశపారంపర్య ధర్మకర్త రాజా ఐవి రోహిత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్యచక్రధరరావు వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా సేవలను అందించి అన్నవరంనకు ఇటీవల బదిలీపై వచ్చారు. గతంలో ఈయన అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా కూడా విధులను నిర్వర్తించారు.

### యర్రవరం శ్రీ సూర్య కళాశాల విద్యార్థిని అభినందించిన

# రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో కాకినాడ జిల్లా టాపర్‌గా నిలిచిన శ్రీ సూర్య విద్యా సంస్థల విద్యార్థిని సమ్మెట్ల నవ్య శ్రీని జగ్గంపేట ఎమ్మెల్యే టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ సాలువా కప్పి పుష్పగుచ్చంతో అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించిన నవ్యశ్రీని, కళాశాల కరస్పాండెంట్ కొలుమల్ల వీర వెంకట సత్యనారాయణను జ్యోతుల అభినందించారు. నేటి విద్యా రంగంలో కళాశాలలు పోటీతత్వంతో పనిచేస్తున్నాయని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని నెహ్రూ అభిప్రాయపడ్డారు. వరుసగా ఐదు సంవత్సరాలుగా శ్రీ సూర్య విద్యా సంస్థలు తమ ప్రతిభ చాటుకుంటున్నాయని భవిష్యత్తులో ఇలాంటి ర్యాంకులు మరి ఎన్నో సాధించాలని ఆకాంక్షించారు.. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యలమంచిలి శేఖర్, శ్రీరామ్, ప్రసాద్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో మజ్జిగ పంపిణీ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాటిపర్తి సుబ్బారావు జ్ఞాపకార్థం కుమారులు తాటిపర్తి రవికుమార్, జగన్మోహన్రావు దాతల సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆసుపత్రి చైర్మన్ వాగు రాజేష్ పాల్గొని మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆస్పత్రి ఆవరణలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ఈరోజు తాటిపర్తి జగన్మోహన్ ఆర్థిక సాయంతో మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందన్నారు. దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తారని కోరుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రమేష్,వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరావు, బుగత శ్రీను, చల్లంచర్ల నాగేశ్వరరావు, వాగు బద్రిష్, కొత్త దత్తుడు, మణికంఠ, చక్రవర్తి, కంది బుజ్జి, వంకాయల సత్తిబాబు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేతో ప్రారంభమైన సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమం

## డిజిటల్ రూపంలో జనగణన తహసిల్దార్ కుమారి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తముగా జరగనున్న జనగణన-2027లో భాగముగా ఈ రోజు ప్రారంభమైన "సెల్ఫ్ ఎన్యూమరేషన్" కాకినాడ రూరల్ మండలం పరిధిలో ఈ రోజు ప్రారంభించబడినది. ప్రారంభ కార్యక్రమములో కాకినాడ రూరల్ నియోజకవర్గం శాసన సభ్యులు పంతం వేంకటేశ్వర రావు(నానాజీ) కుటుంబ సభ్యులతో సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయించుట జరిగినది, జనగణన - 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై శాసన సభ్యులు. పంతం నానాజీ మాట్లాడుతూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ద్వారా ప్రతీ ఇంటి యజమాని ఇంట్లోనే కూర్చొని వారి వివరములు నమోదుచేసుకొనవచ్చునని,నమోదుచేసుకున్న తరువాత వచ్చిన కోడ్ నెంబర్ ను భద్రపరచుకొని, జనాభా గణన ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు వారికి చెప్పడం ద్వారా మన హౌస్ హోల్డ్ టాగింగ్ జరిగి, 2027 సంవత్సరములో జరగబోయే జనగణన ప్రక్రియ సులభతరం గా జరుగుటకు దోహదం చేసినవారు అగునని,కావున అందరూ జనగణనకు సహకరించాలని, ఎవరైనా జనగణనకు ఆటంకం చేపడితే అటువంటి వారి పైనకఠిన చర్యలు తీసుకొనబడునని, ప్రస్తుత జనగణన డిజిటల్ రూపంలో చేయుట వలన జనగణన మరింత సులువుగా మరియు పారదర్శకముగా జరుగునని తెలియచేసినారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ను ఈ నెల 16 తేదీ నుండి 30 వ తేదీ వరకు ఈ లాగిన్ ద్వారా చేసుకొనవచ్చునని, సెల్ఫ్ ఎన్యూమరేషన్ పై ఎవరికైనా సందేహములు ఉన్న యెడల తహశీల్దార్ కార్యాలయము, కాకినాడ రూరల్ నందు సంప్రదించవలెనని తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మండలం తహశీల్దార్ శ్రీమతి. ఎస్.ఎల్.ఎన్. కుమారి, డిప్యూటీతహశీల్దార్లు, ఆర్.కళ్యాణ్ చక్రవర్తి, కే.ఎల్.సురేష్ కుమార్, ఏఎస్ఓ చాగంటి శ్రీకాంత్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీమతి. మేడి వెంకట దుర్గాభవాని, పాల్గొన్నారు.

# కాబోయే సీఎం ఆయనే...పిఠాపురం వర్మ సంచలనం

పిఠాపురం వర్మ మరోసారి బిగ్ సౌండ్ చేశారు. ఏపీలో టీడీపీ తన జాతీయ రాష్ట్ర కమిటీలను ప్రకటించిన వెంటనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ వర్మ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఏపీకి కాబోయే సీఎం అంటూ సంచలన ప్రకటనలు చేశారు. ఇంతకీ వర్మ చెప్పిన ఆ కాబోయే సీఎం ఏమిటి ఆ కథా కమామీషు ఏమిటి అంటే వెరీ ఇంట్రెస్టింగ్

**సీఎం అవడం ఖాయం :** తెలుగుదేశం పార్టీకి చంద్రబాబు తరువాత బలమైన నేతగా నారా లోకేష్ ఉన్నారని వర్మ చెప్పారు. లోకేష్ పదమూడేళ్ళుగా పార్టీ కోసం పనిచేస్తున్నారు అని కొనియాడారు. ఆయన వల్లనే 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని అన్నారు. నారా లోకేష్ కంటే సీఎం పదవికి టీడీపీలో ఎవరూ లేరని వర్మ చెప్పారు. లోకేష్ అన్ని విధాలుగా ఎదిగి ఈ రోజున టీడీపీ జాతీయ స్థాయిలో వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవిని అందుకున్నారు అని అన్నారు. లోకేష్ చంద్రబాబు కుమారుడిగా కాకుండా తన సొంత సత్తాతో ఒక సామాన్య కార్యకర్తగానే ఈ రోజున ఈ పొజిషన్‌లో ఉన్నారని అన్నారు.

**ఎపుడు చేయాలో తెలుసు :** ప్రతీ పార్టీకి తమ నాయకుడిని ఉన్నత స్థానంలో చూడాలని ఉంటుందని వర్మ అన్నారు. అలా తాము అంతా లోకేష్ ని సీఎంగా చూడాలని అనుకుంటున్నామని వర్మ చెప్పారు. అయితే తమ నాయకుడు చంద్రబాబుకు ఎపుడు ఏ సమయంలో లోకేష్ ని సీఎం గా చేయాలో తెలుసు అని అన్నారు. అంతవరకూ తాము వేచి ఉంటామని చెప్పారు లోకేష్ 2023 లో చేసిన పాదయాత్ర టీడీపీని బలంగా తయారు చేసిందని అంతే కాకుండా ఏపీలో మరోసారి బంపర్ విక్టరీ కొట్టేలా చేసింది అని అన్నారు.



**కార్యకర్తల నేత :** అంతే కాకుండా లోకేష్‌ని కార్యకర్తల బాగు చూసే నేతగా వర్మ అభివర్ణించారు. కార్యకర్తల సంక్షేమం కోసం నిధిని ఏర్పాటు చేసిన ఘనత లోకేష్ దే అన్నారు అంతే కాదు లోకేష్ హయాంలోనే టీడీపీ సభ్యత్వం కోటికి చేరుకుందని ఇదంతా యువ నేత సాధించిన విజయమే అని అన్నారు. టీడీపీలో ప్రతీ ఒక్కరూ లోకేష్ సీఎం గా చూడాలని భావిస్తున్నారు అని అయితే చంద్రబాబుదే ఈ విషయంలో కీలక నిర్ణయం అని వర్మ చెప్పుకొచ్చారు.

**గతంలో ఒకసారి :** ఇదిలా ఉంటే గతంలో కూడా ఒకసారి లోకేష్ సీఎం అని పిఠాపురం వర్మ గట్టిగా మాట్లాడారు. ఇపుడు మళ్ళీ అదే విధంగా కోరుతున్నారు. వర్మ 2024 ఎన్నికల్లో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే చాన్స్ ని పొత్తుల వల్ల కోల్పోయారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా దక్కలేదు. అయితే అదనం సీట్లతో తనకు ఈసారి తప్పకుండా టికెట్ వస్తుందని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భావి నాయకుడు లోకేష్ కాబోయే సీఎం అంటూ వర్మ కొనియాడడం మీద చర్చ సాగుతోంది. లోకేష్ చంద్రబాబులకు సన్నిహిత నేతగా పేరు పొందిన వర్మ తన రాజకీయాన్ని తన వారసుడి రాజకీయన్ని కూడా లోకేష్ చేతులలో పెడుతున్నట్లుగా ఆయన తాజా వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. మరి చూడాలి ఏమి జరుగుతుందో.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల విజయకేతనం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఏపీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల రెసిడెన్షియల్ కాలేజీలను విద్యార్థులు విజయాలు సాధించడం గర్వకారణం అని ఆలమండ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అలమండ చలమయ్య అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి కాకినాడ జిల్లా ప్రభుత్వ కళాశాలలో నెంబర్ వన్ స్థానాన్ని సాధిన ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల 82శాతం,ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ 98శాతం సాధించడం ఏలేశ్వరం మండలానికి గర్వకారణమని చలమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కాలేజీలు మును పెన్నడు లేనివిధంగా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు,విద్యా శాఖ మంత్రి లోకేష్ లకు అభినందనలు తెలిపారు. ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు లక్షలపోసి చదివిస్తుంటే పేద ప్రజలకు అండగా అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పిల్లలకు ఉచిత విద్యను అందించడంలో ముందంజలో ఉన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ తన శక్తికి మించి నియోజకవర్గంలో ప్రభుత్వం నుంచి ప్రజలకందాల్సిన సంక్షేమ నిధులను దుర్వినియోగం కాకుండా ప్రజలకు అందించడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అలాగే ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు కాలేజీలకు పంపి తమ ధనాన్ని వృధా చేసే కన్నా ప్రభుత్వ స్కూళ్లలో కాలేజీలలో చేర్పించి ప్రభుత్వ పథకాలను పొందాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె ఎస్ ఎస్ రాజశేఖర్ , వైస్ ప్రిన్సిపాల్ కె బాబ్జీ, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ కె చంద్ర శారద లకు ఘనంగా సన్మానం అందించారు అనంతరం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ అలమండ చలమయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రోజా రమణి, వారి సిబ్బంది,జూనియర్ కాలేజీ సిబ్బంది అనిల్, శివాజీ, మాధవ, కనకరాజు, జ్యోతి, రాజేంద్రప్రసాద్, మోహన్, ఎస్తేరు,అలమండ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాజీ కౌన్సిలర్లు బూరెల సత్తిబాబు,కడెంశెట్టి వాసు, తొండారపు రాంబాబు,బెల్లాన్ని శ్రీను, చిక్కాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### లోకేష్ ఆధ్వర్యంలో యువత, మహిళలకు

# జాతీయ కార్యవర్గంలో ప్రాధాన్యత : బొడ్డు

## నూతన కమిటీలతో పార్టీ మరింత బలోపేతం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో యువత మహిళలు బడుగు బలహీన వర్గాల్లో నూతనోత్సాహం వెల్లువిరిస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్ర వరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి హర్షం వ్యక్తం చేశారు. గురువారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, పార్టీ జాతీయ కార్యవర్గంలో లోకేష్‌కు సముచిత స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు తదితరులు పాత్రికేయులతో మాట్లాడుతూ జాతీయ కార్యవర్గంలో సీనియర్లతో పాటు యువత మహిళలకు కుల ప్రాతిపదికన అవకాశం కల్పిస్తూ పార్టీని మరింత ప్రతిష్టపరిచారన్నారు. యువగళం అధినేత నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి, పార్టీ ప్రతిష్టతకు చక్కటి ప్రతిభ కనబరుస్తూ తనదైన రీతిలో అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందుతూ చక్కటి రాజకీయ పరిపక్వత సాధిస్తున్నార న్నారు. పార్టీలను ఇటు రాష్ట్ర అభివృద్ధిలోనూ తనదైన ముద్ర వేసుకుంటూ కష్టపడి పని చేసే కార్యకర్తలకు సరైన సమయంలో రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కార్యకర్తలకు బీమాతో పాటు విద్య, వైద్యరంగంలో చేదోడుగా నిలుస్తున్నారని కొనియాడారు. సీనియర్ నాయకులు కంటే మాట్లాడుతూ లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ యువ రక్తంతో మరింత ఉరకలు వేయటం తధ్యమన్నారు. తనకాల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం దక్కుతుందని అందుకు తానే ఉదాహరణ అన్నారు. వెంకటరమణ చౌదరిపై ఆ సందర్భ ఆరోపణ చేసే సహించేది లేదని, అది పార్టీకి మచ్చని, గ్రహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పుప్పాల వెంకటరత్నం, రొంగల శ్రీనివాస్, చిట్టి ప్రోలు పద్దరాజు, గండి విజయకుమార్, రాజేష్, యేసు, చైతన్య, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దంపతుల పదవీ విరమణ మహోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చినకొండేపూడి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేకల రాజు మరియు బొబ్బిల్లంక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఆరుగొల్లు మేరీకుమారి దంపతుల పదవీ విరమణ మహోత్సవం గురువారం శ్రీరామనగరంలోని రాజు గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని, పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ మేకల రాజు 37 సంవత్సరాలు, మేరీకుమారి 31 సంవత్సరాల పాటు విద్యా వ్యవస్థకు అందించిన సేవలు వెలకట్టలేనివి. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, ఆదర్శవంతమైన గురువులుగా నిలిచిన వీరి సేవలు ఎప్పటికీ చిరస్మరణీయం. వీరి విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షిస్తు న్నానని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తోటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మరియు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సిసి రోడ్డుపై ఆక్రమణలు చేసి

# ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో కాతేరు నుండి సీతానగరం వరకు నిర్మించిన సిసి రోడ్డుపై ఎటువంటి ఆక్రమణలు చేయవద్దని కోరుకొండ సిఐవివిఎస్ మూర్తి హెచ్చరించారు. రోడ్డుపై ధాన్యం,మొక్క జొన్నలు ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ప్రమాదానికి కారణమైన వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏప్రిల్ 29వ తేదీన శ్రీ మామిడి గంగమ్మ అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ట

## నాగదేవత ప్రయుక్త 27 నాగబందాల ప్రతిష్ట - మహా కుంభాభిషేకం మహోత్సవములు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 400 సంవత్సరాల చరిత్ర గల రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి పంచాయతీ, తేజోనగర్ లే-అవుట్‌లో వేంచేసియున్న మామిడి గంగమ్మ దేవస్థానంలో ఈ నెల 26వ తేది ఆదివారం నుండి మే 03వ తేదీ ఆదివారం వరకూ శ్రీ మామిడి గంగమ్మ అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు జె. వెంకట సూర్య కళ్యాణ్ స్వామి (ఆసాది) తెలిపారు. గురువారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యలమంచిలి సదాశివ గురుకుల్ వారి ఆధ్వర్యంలో వేగేశ్న చంద్రరాజు,పద్మావతి దంపతుల నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు జె. వెంకట సూర్య కళ్యాణ్ స్వామి (ఆసాది) వారి ప్రత్యేక పర్యవేక్షణలో శ్రీ మామిడి గంగమ్మ అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముక్కామల వాసవి పీఠం శ్రీధర్ స్వామీజీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు, తిరుపతి శక్తి పీఠం రాయలచెరువు, మంత్రమహేశ్వరి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యా నంద భారతీ స్వామిని వారి చేతుల మీదుగా ఈనెల 29వ తేదీ ఉదయం 10.21 నిమిషాలకు కలశ స్థాపన,మహా యంత్రములు, శిఖర ప్రతిష్ట మహా కుంభాభిషేకం జరుగుతాయని అన్నారు. 26వ తేది ఉదయం 8 గంటలకు పవిత్ర గోదావరి నది పుష్కరఘాట్ నుండి పవిత్ర నదీ జలాలు, ప్రతిష్ట విగ్రహాలు అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు జరుగుతుందని అన్నారు. 27వ తేదీ ఉదయం10:01 గంటలకు భూతబలి, యాగశాల ప్రవేశము, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, సమస్త దేవతారాధన, దీక్షాధారణ జరుగుతాయని, సాయంత్రం 4 గంటలకు మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్నిబంధము: హోమములు, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పములు జరుగుతాయన్నారు. 28వ తేదీన ఉదయం 10 గంటలకు గణపతి పూజ, వాస్తు పూజ, వాస్తు హోమములు, పర్యాగ్నికరణ, క్షీరాబ్ధివాసము, దాన్యా ధివాసము, జలాధివాసము, ఉదక శాంతి జరుగుతాయని సాయంత్రం గంట లకు 4లకు సమస్త దేవతారాధన, సాలంగణ దేవతారాధన... త్రికుండముల హోమములు, నీరాజన మంత్రపుష్పములు జరుగుతాయన్నారు. 29 వ తేది ఉదయం 7:30 లకు గణపతి పూజ, మహాపూజ, పీఠాధిపతి వారిచే మహా యంత్ర సహిత శిఖర ప్రతిష్ఠ, యంత్ర సహిత నాగదేవత సుబ్రహ్మణ్యేశ్వర, గణపతి సహిత 27 నాగ బంధముల ప్రతిష్ఠ. మహాపూర్ణాహుతి, బింబ దర్శనం, గోదృష్టి, ఉదయం 11:30 గంటలకు పీఠాధిపతి వారి చేతుల మీదుగా అమ్మవారికి మహా కుంభాభిషేకం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. 30 వ తేది గురువారం సాయంత్రం 6 గంట లకు శ్రీ మామిడి గంగమ్మ సమేత గౌతమేశ్వర స్వామివారి వార్షిక శాంతి కళ్యాణ మహోత్సవం అనంతరం నీరాజన మంత్రపుష్పములు జరుగుతాయి అన్నారు. మే 1వ తేదీ వైశాఖ పౌర్ణమి మహా పర్వదినం సందర్భముగా ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయం లో వార్షిక చండీ యాగం,గౌతమేశ్వర స్వామి వారికి మహా రుద్రాభిషేకం కార్యక్రమములు జరుగుతాయని అన్నారు. సాయంత్రం 6 గంటలకు మహిళలచే విష్ణు, లలితా సహస్రనామ పారాయణ జరుగుతుందని తెలిపారు. మే 02 తేదీన ఉదయం 8 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పుష్పాలంకరణ, శ్రీ చక్రార్చన నీరాజన మంత్రపుష్పములు జరుగుతాయని, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి పొన్పు మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు గరగ నృత్యాలతో, మేళ తాళములతో అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. రాత్రి 12:30 గంటలకు ల (తెల్లవారితే ఆదివారం) అమ్మవారికి మహాకుంభిశేకం జరుగుతుందన్నారు.మే 03వ తేదీన ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయం తలుపులు తెరిచి, పునఃపూజ, కుంకుమార్చన, 11 గంటల నుండి మహా అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, పార్లమెంటు సభ్యురాలు, దగ్గుబాటి పురందరేశ్వరి, రాజమండ్రి రూరల్, శాసన సభ్యులు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి అర్బన్ శాసన సభ్యులు, ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం శాసన సభ్యులు, బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి శాసనమండలి సభ్యులు, సోము వీర్రాజు, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమండ్రి ఏ.ఎమ్.సి. చైర్మన్, మార్ని వాసుదేవరావు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు అక్కిన ముని కోటేశ్వరరావు , మాజీ శాసన మండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు, మాజీ శాసన సభ్యులు చందన రమేష్ పాల్గొంటారని అన్నారు. కావున భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి దయా కటాక్షములకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త , దేవాలయం వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్ వేగేశ్న చంద్రరాజు వర్మ, కాలెపు వెంకట భీమ మల్లిఖార్జునరావు (మల్లిబాబు), మనుబోతుల శ్రీనివాస్, కర్రి రామకృష్ణారెడ్డి, ఏల్లేడి వెంకటరాజు (చౌదరి), చిట్టూరి రామకృష్ణ చిచ్చారి వరప్రసాద్, చిచ్చారి నారాయణరావు, కందుల రవికుమార్, కర్రి సత్యనారాయణ రెడ్డి, మాదాబత్తుల త్రిమూర్తులు, చిచ్చారి సుబ్బారావు, కరిబండి దుర్గా రాజేష్ (దొరబాబు), భాష్యం వెంకటేశ్వరరావు, వెలగల సత్యనారాయణరెడ్డి, యర్రమాటి అప్పలరాజు పాల్గొన్నారు.

# రూ.1 లక్ష కోట్ల ఏయుఎం

## మైలురాయి సాధించిన పీరమల్ ఫైనాన్స్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా రిటైల్ రుణ రంగంలో వేగంగా ఎదుగుతున్న ప్రముఖ ఎన్‌బిఎఫ్ సిఅయిన పీరమల్ ఫైనాన్స్ లిమిటెడ్ తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం)ను రూ.1 లక్ష కోట్లకు పైగా పెంచుకుని ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంపెనీకి కీలక మార్కెట్‌గా మారింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో కలిపి 31 బ్రాంచ్‌ల ద్వారా కంపెనీ బలమైన సేవలు అందిస్తోంది. రాష్ట్రంలోని సెమీ-అర్బన్, టయర్-2, టయర్-3 పట్టణాల్లో హోమ్ లోన్‌లు, బిజినెస్ లోన్‌లకు పెరుగుతున్న డిమాండ్ ఈ వృద్ధికి దోహదపడుతోంది. గత నాలుగేళ్లలో కంపెనీ తన బ్రాంచ్ నెట్‌వర్క్‌ను 20 నుండి 650కి పైగా బ్రాంచ్‌లకు విస్తరించింది. ప్రస్తుతం 26 రాష్ట్రాల్లోని 460 నగరాల్లో సేవలు అందిస్తోంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా 1,000 ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పీరమల్ ఫైనాన్స్ రిటైల్ రుణ వ్యాపారం గత నాలుగేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. హోమ్ లోన్‌లు, లోన్ ఎగైనెస్ట్ ప్రాపర్టీ, చిన్న వ్యాపార రుణాలు, డిజిటల్ పర్సనల్ లోన్‌లు, యూజ్డ్ కార్ లోన్‌లతో కంపెనీ పోర్ట్‌ఫోలియో విస్తరించింది. ఎండీ & సీఈఓ జైరామ్ శ్రీధరన్ మాట్లాడుతూ, "రూ.1 లక్ష కోట్ల ఏయూఎం సాధించడం వినియోగదారుల నమ్మకానికి నిదర్శనం. ముఖ్యంగా సెమీ-అర్బన్ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతుండటంతో ఆంధ్రప్రదేశ్ కీలక వృద్ధి మార్కెట్‌గా మారింది. సాంకేతికత ఆధారంగా బాధ్యతాయుత రుణ సేవలను విస్తరించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అన్నారు. కంపెనీ ఫిబ్రవరి 28 నాటికి రూ.1.5 లక్షల కోట్ల ఏయూఎం లక్ష్యంగా పెట్టుకుని గ్రామీణ రుణాలు, గోల్డ్ లోన్‌ల విస్తరణపై దృష్టి సారిస్తోంది.

# బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రైస్తవుల సమాధి కార్యక్రమాల నిమిత్తం రాజమండ్రి రూరల్ ధవలేశ్వరంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ నిర్మించాలని రాజమండ్రి అర్బన్ & రూరల్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియన్ గ్రౌండ్ అడ్వైజరీ కమిటీ, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు. గ్రౌండ్ ఇంచార్జ్, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు పొన్నమాటి బాబ్జి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. బరియల్ గ్రౌండ్ చుట్టుప్రక్కల నివాస ప్రాంతాలైన రెవిన్యూ కాలనీ, సావిత్రినగర్, టిడ్కో గృహాలకు సమస్యలు లేకుండా బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని టిడిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామి ద్వారా స్థానిక శాసనసభ్యులకు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులకు వినతిపత్రం సమర్పించామన్నారు. బరియల్ గ్రౌండ్లో మౌలిక సదుపాయాలు, సిసి రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి బోరు కల్పించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ గోడి మోజెస్, బిషప్ టి. ఆర్డర్ ప్రసాద్, బిషప్ టి.రాజేంద్రప్రసాద్, రెవ. డా. పైడిమళ్ళ సుందరరాజు, రెవ. పి. ఎర్నెస్ట్ మోజెస్, బిషప్ ఎం.సాల్మన్ జార్జ్, బిషప్ ఫ్రాన్సిస్, రెవ. యంపా ప్రభాకర్, బ్రదర్ కె. శాంతారావు, రెవ. బి. ఏలియా, బ్రదర్ గెల్లా విజయ కుమార్, రెవ. బి. జార్జి పీటర్, రెవ. ఎస్. ప్రకాశం, రెవ. ఎం. మానుకొండ సుధాకరరావు, రెవ. డా. జి. డేనియల్ విల్సన్, రెవ. మేడిద విజయ్కుమార్, రెవ. మందా రాజు, శ్రీ గెద్దం వెంకటరత్నం, రెవ. ఆరుగుళ్ళ రాజ్కుమార్, రెవ. ఎం.మోహన్రావు, రెవ. పులగుర్త శ్యామ్ కిల్లీ కుమార్, ఉల్లంపర్తి శామ్యూల్, ప్రొఫెసర్ ఎం. జాషువా కిరణ్, బ్రదర్ ఎస్. శాంతారావు, బ్రదర్ విజయ్ ప్రకాష్, ఇంజేటి రాధాకృష్ణ, ఇంజేటి కిషోర్కుమార్, రెవ. గోడి జాన్, రెవ. ఎస్. లాజరు, రెవ. పి. పరంజ్యోతి, రెవ. చార్లెస్, రెవ. వాసంశెట్టి ఆనంద్ కుమార్, రెవ. రాచర్ల జాకబ్ పాల్గొన్నారు.

# సెన్సస్ నమోదుకు ప్రజలు సహకరించాలి : బొడ్డు




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెన్సెస్ 2027ను ప్రతి ఒక్కరు నమోదు చేయించుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. గురువారం గాడాల తన నివాసంలో బొడ్డు 2027 సెన్సస్ నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ ప్రస్తుత కుటుంబ సర్వేను ప్రజలే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానం నేటి నుండి ఈనెల 30వరకు అందుబాటులో ఉందని ప్రజలు దాన్ని వినియోగించుకోవాలన్నారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాల ఆధారంగానే ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, బడ్జెట్ కేటాయింపులు ఉంటాయన్నారు. గణాంక సేకరణ అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు పూర్తి వివరాలతో సహకరించి, ఖచ్చితమైన సమాచారం తెలియజేయాలన్నారు. వ్యక్తిగత సమాచారం అత్యంత గోప్యంగా ఉంటుందని, దీనివల్ల సంక్షేమ పథకాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ తాసిల్దార్ డి.సుగుణ, ఎఎస్‌వో భగవాన్, సెన్సస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ మహోత్సవంలో పాల్గొన్న బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో రాజు గార్డెన్‌లో జరిగిన ప్రధానోపాధ్యాయులు మేకల రాజు, ఉపాధ్యాయిని ఆరుగొల్లు మేరీ కుమారి దంపతుల పదవి విరమణ మహోత్సవములో రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. వీరి వెంట తెలుగుదేశం,జనసేన, బిజెపి పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కిసాన్ మోర్చా కమిటీలు వెయ్యాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం రాజమండ్రి భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం పేపకాయల కాశీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి దొడ్డ నాగరాజు ఉపాధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది. కిసాన్ మోస్చా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ ప్రతి గ్రామంలో కిసాన్ మోర్చా గ్రామ కమిటీలు వేసుకుని తద్వారా పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరడం జరిగింది.అలాగే పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త భుజాలు వేసుకుని చేయాలని కోరారు.

# వీరేశలింగం సామాజిక దురాచారాల నిర్మూలనకు జీవితాన్ని అంకితం

## జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై.శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సంఘ సంస్కర్త, రచయిత,శ్రీ కందుకూరి వీరేశలింగం 178వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలోని ఆనంద గార్డెన్స్ ప్రాంగణంలో ఉన్న కందుకూరి వీరేశలింగం దంపతుల సమాధి వద్ద పూలు సమర్పించి జనసేన పార్టీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కందుకూరి వీరేశలింగం సమాజంలో ఉన్న సామాజిక దురాచారాలపై పోరాడిన మహానుభావుడని కొనియాడారు. సతీసహగమనాన్ని వ్యతిరేకించి వితంతు పునర్వివాహాలను జరిపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, సామాజిక అభ్యున్నతికి మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన సాహిత్య రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో కీలక పాత్ర పోషించాయని, వివేకవర్ధిని పత్రిక ద్వారా సమాజంలో చైతన్యం కలుగజేసారన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. హితకారిణి సమాజం స్థాపించి విద్యాభివృద్ధికి, సమాజ హితానికి తన యావదాస్తిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తేజ మూర్తుల నరసింహమూర్తి, జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్, దాసరి గురునాథరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కప్పల సూర్య ప్రకాష్, 8వ వార్డ్ ఇంచార్జ్ అక్కిరెడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పైడ్రాజు, పందిరి మహాదేవుడు చౌల్ట్రీ డైరెక్టర్ యందం ఇందిరా, జనసేన పార్టీ వీర మహిళలు సిరినాయుడు, నాగలక్ష్మి, దేవి, తదితరులు పాల్గొన్నారు.




# మహేశ్ బాబు సోదరుడి కుమారుడి సినిమా..

## ఈ బ్యూటీ ఆ టాలీవుడ్ హీరోయిన్ కూతురని తెలుసా?



మహేష్ బాబు సోదరుడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ ఈ సినిమాతో హీరోగా టాలీవుడ్ కు పరిచయం కానున్నాడు. ఆర్ ఎక్స్ 100, మంగళవారం సినిమాలతో ట్యాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న అజయ్ భూపతి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరో రాబోతున్నాడు. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నాడు. అతను నటిస్తోన్న మొదటి సినిమా 'శ్రీనివాస మంగాపురం'. ఆర్ఎక్స్ 100, మంగళవారం చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. 'శ్రీనివాస మంగాపురం' పుణ్య క్షేత్రం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ ఇంటెన్స్ డ్రామాలో బాలీవుడ్ హీరోయిన్ రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగులో ఆమెకు ఇదే మొదటి సినిమా. ఓ వైపు నటిగానే కాకుండా గాయనిగానూ సత్తా చాటుతోందీ అందాల తార. అజాద్ సినిమాలోని ఉయ్ అమ్మ' అనే పాటతో బాగా పాపులర్ అయింది రషా తడానీ. ఇప్పుడు శ్రీనివాస మంగాపురం సినిమాతో తెలుగు ఆడియెన్స్ కు పరిచయం కానుందీ అందాల తా. అన్నట్లు ఈ బ్యూటీ మరెవరో కాదు ఒకప్పుడు బాలీవుడ్ ను ఏలిన స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కూతురు. హిందీలో వందలాది చిత్రాల్లో నటించిన రవీనా తెలుగు ఆడియెన్స్ కు కూడా పరిచయమే. బంగారు బుల్లోడు సినిమాలో బాలకృష్ణ తో కలిసి నటించిందీ అందాల తార. అలాగే రథ సారథి, ఆకాశ వీధిలో, పాండవులు పాండవులు తుమ్మెద సినిమాల్లోనూ కనిపించిందీ రవీనా. ఇక ఆ మధ్యన కేజీఎఫ్ 2 సినిమాలోనూ ఓ కీలక పాత్ర పోషించి పాన్ ఇండియా ఫేమస్ అయిపోయిందీ ముద్దుగుమ్మ. ఇక రవీనా అడుగుజాడల్లోనే నడుస్తోంది ఆమె కూతురు రషా తడానీ. ఇప్పటికే బాలీవుడ్ లో సత్తా చాటిన రషా శ్రీనివాస మంగాపురంతో తెలుగు ఆడియెన్స్ ను పలకరిస్తోంది. ఇందులో ఆమె మంగా అనే పాత్రలో నటిస్తోంది. బుధవారం (ఏప్రిల్ 15) రిలీజైన ఈ సినిమా టీజర్ లో చాలా అందంగా కనిపించింది రవీనా కూతురు. దీంతో ఇప్పుడీ ముద్దుగుమ్మ పేరు తెగ వినిపిస్తోంది. ఇక సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇక సినిమా విషయానికి వస్తే.. ఈ మూవీలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే నరేష్, అజయ్ తదితరులు వివిధ పాత్రల్లో కనిపించనున్నారు. అగ్ర నిర్మాత అశ్విని దత్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని పి కిరణ్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 62 ఏళ్ల వయసులోనే అదే ఎనర్జీ..

## తన క్లాసికల్ సాంగ్‌కు మళ్లీ స్టెప్పులేసిన అలనాటి హీరోయిన్..

గతంలో పలు తెలుగు సినిమాల్లో నటించిన ఈ హీరోయిన్ ఇప్పుడు ఓ డ్యాన్స్ స్కూల్ ను రన్ చేస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తన డాన్స్ స్కూల్ విద్యార్థులతో కలిసి తన సూపర్ హిట్ సాంగ్ కు స్టెప్పులేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేయగా అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. గతంలో హీరోయిన్లుగా ఓ వెలుగు వెలిగిన వారందరూ ఇప్పుడు రీ ఎంట్రీ ఇస్తున్నారు. సెకెండ్ ఇన్నింగ్స్ అంటూ సహాయక నటి పాత్రలు పోషిస్తున్నారు. అదే సమయంలో మరికొందరు ముద్దుగుమ్మలు రకరకాల బిజినెస్ లు చూసుకుంటూ బిజీ బిజీగా ఉంటున్నారు. పై ఫొటోలో ఉన్న హీరోయిన్ కూడా సరిగ్గా ఇదే కోవకు చెందుతారు.. గతంలో పలు తెలుగు, హిందీ, తమిళ సినిమాల్లో నటించారీ అందాల తార. ది గ్రేట్ ఎన్టీఆర్, మెగాస్టార్ చిరంజీవి తదితర స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ గా చేశారు. అయితే చాలా మంది హీరోయిన్లలాగే పెళ్లయిన తర్వాత సినిమా ఇండస్ట్రీకి దూరమైపోయారు. ఎక్కడో అమెరికాలో పిల్లలకు డ్యాన్స్ స్కూల్ నిర్వహిస్తూ బిజీ బిజీగా ఉంటోంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో కనిపించే ఈ అందాల తార తాజాగా ఒక వీడియోను తన ఇన్ స్టా గ్రామ్ ఖాతలో షేర్ చేశారు. అందులో తన స్కూల్ డ్యాన్స్ పిల్లలతో కలిసి ఓ తెలుగు పాటను రీక్రియేట్ చేశారీ ముద్దుగుమ్మ. అది కూడా 34 ఏళ్ల క్రితం ఆమె నటించిన ఓ క్లాసిక్ సాంగ్ కు ఎంతో ఉత్సాహంగా స్టెప్పులేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరలవుతోంది. దీనిని చూసిన నెటిజన్లు ఈ ముద్దుగుమ్మ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అప్పటికీ, ఇప్పటికీ ఈ అందాల తార ఏం మారలేదంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ ఈ హీరోయిన్ ఎవరో గుర్తు పట్టారా? ఆమె మరెవరో కాదు ఆపద్బాంధవుడు హీరోయిన్ మీనాక్షి శేషాద్రి. కే విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించారు. 1992లో రిలీజైన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఏకంగా ఐదు నంది అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సినిమాలోని ప్రతిపాట కూడా ఒక ఆణిముత్యమే అని చెప్పాలి. ప్రధానంగా 'అవురా అమ్మక చెల్లా' అయితే ఎవర్ గ్రీన్ క్లాసికల్ సాంగ్. ఇందులో చిరంజీవి, మీనాక్షిల డ్యాన్స్ అద్భుతమని చెప్పవచ్చు. అప్పట్లో కులు మనాలిలో చిత్రీకరించిన ఈ పాటను మళ్లీ ఇప్పుడు మీనాక్షి శేషాద్రి రీక్రియేట్ చేశారు. 62 ఏళ్ల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. మీనాక్షి శేషాద్రి అసలు పేరు శశికళ శేషాద్రి. 1991లో వచ్చిన బ్రహ్మర్షి విశ్వామిత్ర సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత చిరంజీవి హీరోగా నటించిన ఆపద్బాంధవుడు సినిమాతో చాలా మందికి ఫేవరేట్ హీరోయిన్ గా మారిపోయారు. దీని తర్వాత మరో తెలుగు సినిమాలో కనిపించలేదీ అందాల తార. ఎక్కువగా హిందీ సినిమాలకే పరిమితమైపోయారు. కాగా 1997 తర్వాత సినిమా ఇండస్ట్రీకి పూర్తిగా దూరమైపోయారు మీనాక్షి.



# డికాక్ సెంచరీ వృథా.. ప్రభసిమ్రాన్, శ్రేయస అయ్యర్ మెరుపులతో పంజాబ్ ఘనవిజయం

ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్ ఘనవిజయం సాధించింది. ముంబై ఇండియన్స్ నిర్దేశించిన 196 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ మరో 21 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి, ఈ సీజన్‌లో తమ అజేయ ప్రస్థానాన్ని కొనసాగించింది. క్వింటన్ డికాక్ అద్భుత సెంచరీ వృథా కాగా, పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రభసిమ్రాన్ సింగ్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ నిప్పులు చెరిగే బంతులతో వరుస బంతుల్లో రికెల్టన్ (2), సూర్యకుమార్ యాదవ్ (0)లను అవుట్ చేసి ముంబైని డిఫెన్స్‌లో పడేశాడు. అయితే, రోహిత్ శర్మ గాయంతో దూరం కావడంతో వచ్చిన అవకాశాన్ని క్వింటన్ డికాక్ అద్భుతంగా వాడుకున్నాడు. కేవలం 60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి నమన్ ధీర్ (50) తోడవ్వడంతో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్ల




నష్టానికి 195 పరుగులు చేసింది. 196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు పవర్‌ప్లేలో రెండు వికెట్లు కోల్పోయినా ప్రభసిమ్రాన్ సింగ్ అండగా నిలిచాడు. ప్రభసిమ్రాన్ కేవలం 18 బంతుల్లోనే 35 పరుగులు చేసి వేగాన్ని పెంచాడు, ఆపై గేర్ మార్చి 78 పరుగులు బాదాడు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మూడో వికెట్‌కు 70 పరుగులకు పైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరి జోరుకు ముంబై బౌలర్లు బెంబేలెత్తిపోయారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కూల్ అండ్ క్లాస్ బ్యాటింగ్‌తో ముంబై బౌలర్లను ఆడుకున్నాడు. గజన్‌ఫర్ రెండు వికెట్లు తీసి ముంబైని రేసులోకి తెచ్చే ప్రయత్నం చేసినా, శ్రేయస్ అయ్యర్ (66) ఏమాత్రం తడబడకుండా బాదాడు. 31 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న శ్రేయస్, పంజాబ్ జట్టును గెలుపు ముంగిట నిలిపి అవుట్ అయ్యాడు. పంజాబ్ కేవలం 16.3 ఓవర్లలోనే 198 పరుగులు చేసి విజయం సాధించింది. జస్ప్రీత్ బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేసినా, ఇతర బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ముఖ్యంగా శ్రేయస్, ప్రభసిమ్రాన్ పార్టనర్ షిప్ ముంబై అవకాశాలను దెబ్బతీసింది. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబైకి ఇది ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్ కాగా, అందులో ఇది నాలుగో ఓటమి. మరోవైపు శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో పంజాబ్ ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు గెలిచి, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

# హైదరాబాద్‌కు బయలుదేరిన ధోనీ..

## ఎస్‌ఆర్‌హెచ్‌తో మ్యాచ్‌లో 'తలా' సందడి ఖాయమేనా?

గత కొన్ని వారాలుగా గాయంతో సతమతమవుతున్న ధోనీ, శనివారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే మ్యాచ్ కోసం జట్టుతో కలిసి ప్రయాణమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ మొదలైనప్పటి నుంచి మైదానంలో కనిపించని 'తలా' ఎంఎస్ ధోనీ, మళ్ళీ యాక్షన్‌లోకి వచ్చేందుకు సిద్ధమయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఎట్టకేలకు ఒక తీపి కబురు అందింది. ఐపీఎల్ 2026 సీజన్ మొదలైనప్పటి నుంచి మైదానంలో కనిపించని 'తలా' ఎంఎస్ ధోనీ, మళ్ళీ యాక్షన్‌లోకి వచ్చేందుకు సిద్ధమయ్యాడు. గత కొన్ని వారాలుగా గాయంతో సతమతమవుతున్న ధోనీ, శనివారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే మ్యాచ్ కోసం జట్టుతో కలిసి ప్రయాణమయ్యాడు. ధోనీ టీమ్ బస్సు ఎక్కుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, అతడు తుది జట్టులో ఉంటాడనే ఆశలు చిగురించాయి. ఐపీఎల్ 2026 ప్రారంభంలో ధోనీ కాలి కండరాల గాయం కారణంగా మొదటి రెండు వారాలు ఆటకు దూరమయ్యాడు. గతంలో గువహటి, బెంగళూరులో జరిగిన అవే




మ్యాచ్‌లకు కూడా ధోనీ వెళ్లలేదు. కానీ, గురువారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన జట్టుతో ధోనీ కూడా ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్టేడియం గేట్ల వద్ద వేచి ఉన్న అభిమానులకు తలా చిరునవ్వుతో అభివాదం చేస్తూ బస్సు ఎక్కాడు. సీఎస్‌కే అధికారికంగా "On Time, All set for Hyderabad" అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది.

**జట్టులో ధోనీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

ప్రస్తుతం రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో చెన్నై వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి ఫామ్‌లోకి వచ్చింది. పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉన్నప్పటికీ, జట్టులో డెవాల్డ్ బ్రెవిస్, నూర్ అహ్మద్ వంటి యువ ఆటగాళ్లు అదరగొడుతున్నారు. ఇలాంటి సమయంలో ధోనీ జట్టులోకి వస్తే అది అదనపు బలంగా మారుతుంది. అయితే ధోనీ పూర్తిస్థాయిలో కీపింగ్ చేస్తాడా లేక ఇంపాక్ట్ ప్లేయర్?గా కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే వస్తాడా అన్నది సస్పెన్స్‌గా మారింది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగే ప్రాక్టీస్ సెషన్ తర్వాత ధోనీ ఫిట్‌నెస్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**హైదరాబాద్ వర్సెస్ చెన్నై – అసలైన మజా**

శనివారం జరగబోయే మ్యాచ్‌కు టికెట్లన్నీ ఇప్పటికే అమ్ముడైపోయాయి. ఒకవైపు ధోనీ రాక, మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా జట్టులోకి తిరిగి వస్తుండటంతో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది. ఉప్పల్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుండటంతో, ధోనీ హెలికాప్టర్ షాట్ల కోసం అభిమానులు వేచి చూస్తున్నారు. ఒకవేళ ధోనీ తుది జట్టులో లేకపోయినా, డగౌట్‌లో ఉండి గైక్వాడ్‌కు సలహాలు ఇవ్వడం కూడా జట్టుకు ఎంతో మేలు చేస్తుంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com